J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 14 06.09.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# వరద ముప్పు.. ఎవరిదీ తప్పు?



- బ్రతుకుకి భరోసా లేని భారత నగరాలు
- అక్రమాలని, ఆక్రమణలని అదుపు చేయలేని ప్రభుత్వాలు
- ప్రజల అవస్థలకి శాశ్వత పరిష్కారం చూపలేని వ్యవస్థలు
- కాశ్మీరం నుండి కన్యాకుమారి వరకు ఇదే దుస్థితి

అకస్మాత్తుగా వచ్చి ప్రపంచాన్ని మొత్తం గడగడలాడించిన కరోనా లాంటి మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొన్న అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మన భారత దేశం. అదే భారతదేశం ప్రతి ఏటా వచ్చే ప్రకృతి వైపరీత్యాలని ముందుగానే పసిగట్టి కట్టడి చేయలేకపోతోంది. తరచూ వచ్చే వరద విపత్తుల నుండి ప్రజలని కాపాడుకోగలిగిన వ్యవస్థలను రూపొందించుకోలేకపోతోంది. వరద ముప్పుల నుంచి ప్రజలను కాపాడుకునేందుకు శాశ్వత పరిష్కారమార్గాలను నేటికీ కనిపెట్టలేకపోతోంది. కాశ్మీరం నుండి కన్యాకుమారి వరకూ ప్రతి రాష్ట్రంలోనూ ఇదే దుస్థితి. ముందుచూపు లేకుండా, పటిష్టమైన ప్రణాళిక లేకుండా అప్రతిహతంగా ఎదుగుతున్న నగరాలే అధికశాతం వరద ముంపులకి, ముప్పులకి గురవుతున్నాయి. జన జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. మహానగరాలలో ఉండేవన్నీ కేవలం ఎండాకాలపు వాడలు, మేడలే తప్ప వర్షం వస్తే.. అవి నిలువ నీడని కూడా ఇవ్వలేవన్న కఠోర సత్యాన్ని మన కళ్ళముందే జరుగుతున్న అనేక సంఘటనలు రుజువు చేస్తున్నాయి.


అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన నేటి అంతర్జాల యుగంలో, నిరంతరం వచ్చే ప్రకృతి వైపరీత్యాలకు ప్రతి ఏటా ఎక్కడో ఒకచోట కొన్ని వందల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. కొన్ని వేల కుటుంబాలు నిలువనీడని కోల్పోతున్నాయి. కొన్ని లక్షల కోట్ల

10 లో




# మానవీయ నేత.. మనసున్న దాత

## వరద బాధితుల కోసం.. వీపీఆర్ కోటి విరాళం



## మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్న

## సేవా ప్రభాకరుడు

నెల్లూరు పార్లమెంటు సభ్యులు, సేవే తన శ్వాసగా జీవించే సమాజ సేవకులు, ఆధ్యాత్మికతత్పరులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మరోసారి తన దయాగుణాన్ని, దాతృత్వాన్ని చాటుకున్నారు. వరద తాకిడికి విలయవాడగా మారిన విజయవాడ వాసులని ఆదుకోవడానికి తనవంతు సాయంగా కోటి రూపాయల విరాళాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకి స్వయంగా అందచేశారు. తన సతీమణి.. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో సహా ప్రభాకరరెడ్డి చంద్రబాబుని సెప్టెంబర్ 3వతేదీ సోమవారంనాడు విజయవాడలో కలసి కోటి రూపాయల చెక్కుని అందచేశారు.

ఎక్కడ ఏ అవసరం వచ్చినా నేనున్నానంటూ ముందుగా స్పందించే దయార్థ్ర హృదయం ప్రభాకరరెడ్డిది. ఇలాంటి వారు రాజకీయాలలో అరుదుగా ఉంటారు. సామాజిక సేవకై తపిస్తూ, ఆధ్యాత్మిక సేవలో తరిస్తూ

3 లో



# చవితి ఉత్సవాల్లో.. జాగ్రత్తలు తప్పనిసరి

## - నిర్వాహకులకు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ సూచనలు



వినాయక చవితి ఉత్సవాల్లో జాగ్రత్తలు పాటించాలని గణేష్ ఉత్సవాల కమిటీల నిర్వాహకులకు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలను ఆయన పేర్కొంటూ ఈనెల 1న ఆయనో ప్రకటన విడుదల చేశారు. మండపాలకు అమర్చిన విద్యుత్ తీగలు ఎవరూ తాకకుండా చూడాలని, షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా వైర్ల కనెక్షన్లు సక్రమంగా ఏర్పాటుచేసుకోవాలని తెలిపారు. ఎక్కువ వేడిగా ఉండే, పైన కవర్‌లేని హాలోజన్ బల్బులు వాడవద్దన్నారు. బాణసంచా కానీ, అగ్నిప్రమాదాలకు దారితీసే ఇతర వస్తువులు కానీ మండపాల్లో ఉండకూడదన్నారు. రాత్రి సమయాల్లో కనీసం ముగ్గురు వలంటీర్లు మండపాల్లోనే నిద్రించాలని, మండపాల వద్ద కొత్త వస్తువులు, బ్యాగులు, బ్రీఫ్‌కేసులు, బొమ్మలు వంటి అనుమానాస్పద వస్తువులుంటే వాటిలో పేలుడు పదార్థాలుండే అవకాశం ఉంటుంది కనుక, నిర్వాహకులు అప్రమత్తగా ఉండి, అవసరమైతే వెంటనే పోలీసులకు ఆ సమాచారం తెలియజేయాలని పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలను నివారించేందుకు అవసరమైన ఇసుకబస్తాలు, నీటి బకెట్లను కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పూజల కోసం వచ్చే భక్తులు తీసుకువచ్చే లగేజీలు, పార్శిళ్ల వంటివాటిని అనుమతించవద్దన్నారు. విగ్రహాల వద్ద వెలిగించిన దీపాల విషయంలో కూడా మెలకువగా ఉంటూ, అవి కిందపడి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలని, లౌడ్‌స్పీకర్లను నిర్దేశించిన సమయాల్లోనే వినియోగించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే 112 నంబరుకు కానీ, స్థానికంగా ఉండే పోలీసులకు కానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. ఉత్సవాలకు అనుమతులు పొందేందుకు ప్రభుత్వం సింగిల్‌విండో విధానం అమలుచేస్తోందని, నిర్వాహకులు ఆ వివరాలను తెలుసుకుని ముందస్తుగా అనుమతులు పొందాలని, మండపాలకు సంబంధించి అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆయన పేర్కొన్నారు.

# మనుబోలమ్మ అమ్మవారికి.. ప్రత్యేక పూజలు



మనుబోలు గ్రామదేవత మనుబోలమ్మ అమ్మవారి ఆలయంలో ఈనెల 1న అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. అమ్మవారికి వైభవంగా పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి వచ్చి పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోలంరెడ్డి హరినాథ్‌రెడ్డి-హారిక దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ అర్చకుడు ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

# ఉద్యోగుల పాలిట పెనుభూతం.. సీపీఎస్

సీపీఎస్ విధానం ఉద్యోగుల పాలిట పెనుభూతం లాంటిదని, దానిని వెంటనే రద్దు చేయాలని బీటీఏ నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 1న నెల్లూరులోని విఆర్‌సి కూడలి వద్దనున్న డా.అంబేద్కర్ విగ్రహం వద్ద వారు సీపీఎస్‌కు నిరసనగా ఆందోళన చేశారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ మాట్లాడుతూ, సీపీఎస్ విధానం వచ్చినప్పటినుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయుల కుటుంబాలకు భద్రత అనేదే లేకుండాపోయిందని, పదేళ్ళుగా దానిపై ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఆ విధానాన్ని వెంటనే రద్దుచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆందోళనలో బీటీఏ వ్యవస్థాపకుడు నూకలపాటి రమణయ్య, నాయకులు మాసా ప్రసాద్, మాల్యాద్రి, మనోజ్, బ్రహ్మయ్య, తిరుపతయ్య, రఘు, ఖాజారహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

# వీఎస్‌యులో 'వనం-మనం'

పర్యావరణం పరిరక్షణలో భాగంగా ఇటీవల కావలిలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ కళాశాలలో 'వనం-మనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా.సుశీల, డా.శ్రీనివాస్ ఆధ్వర్యంలో, రోటరీ క్లబ్-కావలి, అటవీ శాఖ- కావలి డివిజన్ వారి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. వీఎస్‌యు వైస్ ఛాన్సలర్ ఆచార్య విజయభాస్కర రావు, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, ఆర్డీఓ శీనానాయక్, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వీరారెడ్డి పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

# వైద్యశిఖామణి!



ఓ వ్యాధిగ్రస్త సహచరుడా
ఇప్పుడు నువ్వొక వ్యూహగ్రహణంలో
చిక్కుకున్నావ్
ఇది చురకత్తులు లయబద్ధంగా
నాట్యమాడే సమయం.
నాడి పట్టి వేదనను చదవాల్సిన
వైద్యబ్రహ్మలు
మదోన్మత్తులై రహస్య వ్యూహాల్ని
పేర్చి పేలుస్తున్న
యుద్ధ సమయ దృశ్యం.
తెరిచిన నాలుకలో అంతరార్థం
బోధపడి
ఒక్కసారిగా పెన్నూ పేపరై...
అంతర్యుద్ధమై పోటెత్తాల్సిన డాక్టర్లు
నీపై అప్రకటిత యుద్ధం సాగిస్తుంటే
జబ్బుపై జబ్బ చరిచి రోగాన్ని తరమాల్సిన
దూకుడు ప్రదర్శించాల్సిన వ్యక్తి
నాడి చూసి నడ్డివిరిచే క్రియకు
పూనుకోవడం ఏమని చెప్పగలం!
స్టెత్ ఇప్పుడు మౌనంగా స్ట్రెచర్‌పై
దాక్కొని రోదిస్తున్నది.
ఆయుధం ధరిస్తేనే కదా
యుద్ధం చేయగల్గేది...
ఆయుధాలు వదిలేసి ల్యాబ్ యుద్ధం
ట్యూబ్ యుద్ధాలు చేస్తే వైద్యం రక్తికట్టదు కదా!
ఎక్స్‌రే కణాల బారిన పడేస్తే
రోగికి వ్యాధి నయమెలా అవుతుంది
ఇప్పుడు -
యమపాశాల్ని ఎదిరించే వైద్యశాస్త్రాలతో
ప్రతిఘటించాలి.
రోగగ్రస్థ హృదయ పద్మవ్యూహంలో చిక్కుకొన్న
వ్యాధి అభిమన్యుణ్ణి బయటకు తేగల్గిన
వైద్యశిఖామణి కావాలి.
వృద్ధాప్యం వసివాడక తప్పదు
వైద్యుని మనసు కృతనిశ్చయమైతే
రోగి నిలబడి నడుస్తాడు,
పల్స్ చూడాల్సిన పరమశివుడు
పర్స్‌పై కాకుండా మనిషిపై నిమగ్నమైతే
బూడిద మిగిలే బాధుండదు!



- చిన్ని నారాయణరావు
9440202942

కృష్ణమందిరం సమస్యపై

# ఒక్క ఫోన్‌కాల్‌తో స్పందించిన శ్రీధర్‌రెడ్డి

## ఎంఎల్‌ఏ చొరవకి ముగ్ధులైన ఇస్కాన్ మందిర నిర్వాహకులు



నగరంలోని కొండాయపాళెం రోడ్డులోని ఇస్కాన్ మందిరం వద్ద వున్న చిరకాల డ్రైనేజీ సమస్యను మందిరం నిర్వాహకులు రూరల్ ఎంఎల్‌ఏ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. మందిరం ముందు ఎలాంటి కాలువ లేక పోవడంతో మురుగు చేరుతోందని, కృష్ణాష్టమి వేడుకలు వస్తుండడంతో భక్తులు ఇబ్బంది పడతారని, తాత్కాలికంగానైనా తమ సమస్యని పరిష్కరించమని కృష్ణాష్టమి పండుగకి పది రోజుల




ముందు(ఆగష్టు14న) ఇస్కాన్ మందిర అధ్యక్షులు శుకదేవస్వామి శ్రీధర్ రెడ్డిని ఫోన్‌లో కోరారు. వారి అభ్యర్ధనకి వెంటనే స్పందించిన శాసనసభ్యుడు తక్షణమే మునిసిపల్ సిబ్బందిని పురమాయించి కేవలం పదిరోజులలో (ఆగష్టు 24లోపు) కాలువ నిర్మింపచేసి సమస్యని శాశ్వతంగా పరిష్కరింపచేశారు. తమ ఎంఎల్‌ఏ చొరవకి, కార్యదక్షతకి మందిర నిర్వాహకులు ముగ్ధులైపోయారు. శ్రీధర్‌రెడ్డి ఘనతని కృష్ణాష్టమి వేడుకలలో పాల్గొన్న భక్తులకి చెప్పి ఆయనకి ధన్యవాదాలు తెలిపారు. మందిర నిర్వాహ కులు శ్రీధర్‌రెడ్డిని స్వయంగా కలుసుకుని ఇస్కాన్ భక్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# జవహర్ భారతిలో..జాతీయ క్రీడా దినోత్సవాలు




జాతీయ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని కావలిలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో ఆగస్టు 29 నుంచి 31వ తేదీ వరకు జాతీయ క్రీడా దినోత్సవాలను ఉత్సాహంగా నిర్వహించారు. కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి డా.పి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రీడోత్సవాల్లో విద్యార్థినీ విద్యార్థులకు వాలీబాల్, బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, ఫుడ్‌బాల్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.పి.సుబ్రహ్మణ్యంనాయుడు, డా.ఆర్.మాల్యాద్రినాయుడు పర్యవేక్షించారు.

# ఆకట్టుకున్న సాహిత్యోపన్యాసం



చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇటీవల 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహిక ప్రసంగ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. టీ.నగర్‌లోని ఆంధ్ర సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా), కృష్ణాహాలు వేదికగా జరిగిన ఈ కార్యక్రమాన్ని వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు ఆధ్వర్యంలో నిర్వహించారు. 'తెనాలి రామకృష్ణుని కవితా వైభవం'పై ప్రసిద్ధ సాహితీవేత్త, వరంగల్లు 'సహృదయ' సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు గన్నమరాజు గిరిజా మనోహరబాబు ప్రసంగించారు. సాహితీలోకం గర్వించదగ్గ మహాకవి తెనాలి రామకృష్ణుడని, శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో ఉంటూ ఆయన చేసిన సారస్వత సేవలు అపూర్వమన్నారు. అనంతరం వేదిక నిర్వాహకులు వక్తను ఘనంగా సన్మానించారు.

# బాధితులకు బాసటగా మాగుంట కుటుంబం



## ముఖ్యమంత్రి సహాయ నిధికి కోటీ యాభై లక్షల విరాళం

విజయవాడ వరద బాధితులకి బాసటగా ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి తమ కుటుంబం పక్షాన కోటీ యాభై లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించారు. గురువారం మధ్యాహ్నం విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసిన మాగుంట శ్రీనివాసులరెడ్డి కోటీ యాభై లక్షల చెక్కుని అందచేశారు. శీనయ్యతో పాటు ఆయన సోదరుడు దివంగత మాగుంట సుబ్బరామరెడ్డి అల్లుడు ఆనం శివకుమార్‌రెడ్డి కూడా ఉన్నారు.

# వీపీఆర్ కోటి విరాళం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజల మనసుల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నారు వేమిరెడ్డి దంపతులు. తాము జనం కోసమే పుట్టామన్న నమ్మకాన్ని, భరోసాని జనంలో కల్పించిన తరువాతే వాళ్లిద్దరూ రాజకీయ రంగంలో అడుగుపెట్టారు. "లోకాన్ని వెలిగించే తొలి కిరణం సూర్యునిదే... సేవాభావాన పులకించే సహృదయం ప్రభాకరునిదే.." అంటూ దివంగత భారతీయ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వేమిరెడ్డి దయార్ధ్ర హృదయం గురించి స్వయంగా పాడారు. ఆ పాటకి అక్షర సాక్ష్యంగా విజయవాడ బాధితుల ఆక్రందనలని చూసి ఆవేదన చెంది కోటి రూపాయలు విరాళంగా ఇచ్చి స్పందించిన తొలి రాజకీయ నాయకుడు మన ప్రభాకరుడే కావడం మన జిల్లాకే కాదు, రాష్ట్రానికే గర్వకారణం. ఈ కలియుగంలో ఇలాంటి మహాదాతలు ఉండడం, అదీ ఆయన మన జిల్లావారు కావడం నెల్లూరుజిల్లా వాసులు చేసుకున్న పుణ్యమే. ధనం చాలామంది వద్ద ఉంటుంది. కానీ, ఇలా తనకున్న ధనాన్ని పదిమందికీ పంచగల గుణం కోటిమందిలో ఏ ఒక్కరికో ఉంటుంది. ఆ ఒక్కరిలో మన ప్రభాకరరెడ్డి ఒకరు కావడం మన అదృష్టం.

# బ్రాహ్మణపల్లిలో వీపీఆర్ 'అమృతధార'




తన దాతృత్వంతో జిల్లాలోని అనేక గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీరు అందుబాటులోకి తెస్తున్న సేవాభూష ణులు.. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభా కర్‌రెడ్డి ఇటీవల జిల్లా లోని మెట్ట ప్రాంత మైన మర్రిపాడు మం డలం బ్రాహ్మణపల్లి గ్రామంలో మరో రెండు వాటర్‌ప్లాంట్లు ఏర్పాటుచేశారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో కలిసి ఆయన వాటికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయడం తన అభిమతమ న్నారు. ఉదయగిరి ప్రాంతంలో ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామా లకు సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో 2017 నుంచి విపిఆర్ అమృతధార పేరిట, తన సొంత నిధులతో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం ప్రారంభించామని, ఆ తర్వాత విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్ర మాన్ని జిల్లా అంతటా విస్తరించామని చెప్పారు. బ్రాహ్మణ పల్లి దళితవాడలో ఒకటి, బ్రాహ్మణపల్లి గ్రామంలో మరొక వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని, వాటి నిర్వ హణ కూడా తమ ఫౌండేషన్ చూసుకుంటుందన్నారు. అపర భగీరథునిలా అవతరించి... దాహంతో అల్లాడు తున్న తమ ప్రాంతానికి మంచినీళ్ళు అందించి మా దాహార్తిని తీరుస్తున్న దైవం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అని గ్రామస్తులు విపిఆర్‌ను కీర్తించడం గమనార్హం.

## 'గురునిలయం'లో ..
# 9న వెంకయ్యస్వామి ఆరాధన

నెల్లూరు మూలాపేటలోని 'గురునిల యం'లో ఈనెల 9న భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి వారి 42వ ఆరాధన మహోత్స వాన్ని వైభవంగా నిర్వహిస్తామని శ్రీవారి పాదరేణువు మాకాని వెంకట్రావుస్వామి కుటుంబసభ్యుడు గోపి తెలిపారు. తుమ్మలతలుపూరు శ్రీ నారాయణదాసు స్వామి, శ్రీ వటుకనాథస్వామి, గాలిపాళెం శ్రీహరిస్వామి, అవధూత కాంతమ్మ శిష్యుడు సుబ్బారెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా 8వ తేదీన వెంకయ్యస్వామి నామ సంకీర్తనతో భిక్షాటన, స్వామివారి ఊరేగింపు, 9న స్వామివారికి, మాకాని స్వామి వారికి పూజలు జరుగుతాయని, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం నగరోత్సవం ఉంటాయన్నారు.



# మట్టి విగ్రహాలే మంచివి

## - కృష్ణపట్నం పోర్టు సీఇఓ జీజే రావు

వినాయకచవితి సందర్భంగా గణే శుని పూజకు పర్యావరణానికి హాని కలుగ కుండా మట్టి వినాయక ప్రతిమలకు పూజలు చేయడం మంచిదని ముత్తుకూరు మండలంలోని అదాని కృష్ణపట్నం పోర్టు సీఇఓ జీజే రావు చెప్పారు. ఈనెల 4న ఆయన పోర్టులోని ఉద్యోగులు, సిబ్బందికి, కార్మికులకు సుమారు 1500 వినాయకుడి మట్టి ప్రతిమలను అందజేశారు.

## విజిలెన్స్ ఎస్పీగా
# రాజేంద్రకుమార్

జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా పీఆర్ రాజేంద్రకుమార్ నియమితు లయ్యారు. ఆ మేరకు ఆ శాఖ డీజీ హరీఫ్ కుమార్‌గుప్తా ఈనెల 4న ఉత్తర్వులు జారీచేశారు. రాజేంద్రకుమార్ గతంలో నెల్లూరుజిల్లాలో పనిచేసివున్నారు. నెల్లూ రులో రైల్లే డీఎస్పీగా, సీఐడీ విభాగంలో ఏఎస్పీగా కూడా సమర్ధవంతగా పనిచేసి మంచిపేరు తెచ్చుకున్నారు. కొత్తగా జిల్లా విజిలెన్స్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్న రాజేంద్రకుమార్‌కు 'లాయర్' శుభాకాంక్షలు.




# ఆర్. ఆర్. రమణారెడ్డికి ఆత్మీయ సత్కారం

***"పితామహ ఆఫ్ ఆంధ్రస్టైల్ ఫుడ్ ఇన్ కర్ణాటక"గా ప్రసిద్ధిచెందిన మన నెల్లూరీయుడు ఆర్.ఆర్.రమణారెడ్డిని కర్ణాటక స్టేట్ హోటల్స్ అసోసియేషన్ వారు ఘనంగా, సగౌరవంగా సన్మానించుకున్నారు.***

ఆగస్టు 31వ తేదీ బెంగళూరు నగరంలో జరిగిన అసోసియేషన్ జిల్లాల సమ న్వయ సమావేశంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు రమణారెడ్డిని సత్కరించారు. తమ ఆర్.ఆర్.రెస్టారెంట్ ద్వారా ఆంధ్ర స్టైల్ ఆహారాన్ని అందించడంలో తనదైన మార్కు వేసుకున్న రమణారెడ్డిని ఈ సమావేశంలో పాల్గొన్న అతిథులంతా పొగడ్తలతో ముంచెత్తారు. ఆతిథ్య పితామహుడిగా పేరు గడించిన రమణారెడ్డి చాలామందికి మార్గదర్శకులని అన్నారు. ఆయనకి ఏకలవ్య శిష్యులు కూడా ఉన్నా రని, వారంతా రమణారెడ్డిని ఆదర్శంగా తీసుకుని రెస్టారెంట్లు ప్రారంభించి విజయ వంతంగా నడుపుతున్నారన్నారు. కర్ణాటక స్టేట్ హోటల్స్ తరపున రమణారెడ్డిని సత్కరించుకోవడం తమ అదృష్టమని అన్నారు.

ఆర్.ఆర్.కి 'లాయర్' అభినందనలు.

# పవన్‌కల్యాణ్.. సేవాభావం అపూర్వం

## - ఎంపీ వేమిరెడ్డి



ప్రజలకు సేవ చేయాలనే తపనతో ముందుకుసాగుతున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సేవాభావం అపూర్వ మని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. పవన్‌కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 2న ఇందుకూరుపేట మండలం గంగపట్నంలో జరిగిన కార్యక్ర మంలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో పాటు ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి, పలువురు నాయ కులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మెగా రక్తదానశిబిరాన్ని వారు ప్రారంభించారు. రక్తదానం పుణ్యకార్యమంటూ, రక్తదాతలను ఆయన అభినందించారు. పవన్ యువత జిల్లా అధ్యక్షుడు గుడి హరికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, కొరియోగ్రాఫర్ జానీమాస్టర్ దంపతులు, రూప్‌కుమార్‌యాదవ్, పలువురు బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.




లాయర్
సెప్టెంబర్ 06, 2024

# అధ్వాన్నపు భోజనాలు.. అవస్థల్లో విద్యార్థులు

పాఠశాలల్లో, గురుకులాల్లో, అనేక విద్యాలయాల్లో చదువుకునే నిరుపేద పిల్లలకు కలుషిత ఆహారం పెట్టడం, వారు అనారోగ్యాలకు గురై మంచం పట్టడం, ఒక్కోసారి అది వారి ప్రాణాలమీదకు రావడం అన్నపూర్ణ వంటి ఆంధ్ర రాష్ట్రంలోనూ సర్వసాధారణమైపోయింది. అనునిత్యం బడుల్లోనో, లేదా పాఠశాలల్లోనో, వసతిగృహాల్లోనో పెట్టే అన్నం నాసిరకంగా, మనుషులెవరూ తినలేనంత ఘోరంగా ఉండడంతో విద్యార్థులు పడుతున్న బాధలు లెక్కలేనన్ని. అసలే చాలీచాలని తిండి, అందులోనూ ఉడికీ ఉడకని అన్నం, పాసిపోయిన కూరలు, పాడైపోయిన కోడిగుడ్లు, ఒక్కోచోట పురుగులు పట్టిన అన్నాన్ని కూడా వేడిచేసి వడ్డించేస్తుంటారు. ఇంత పాపానికి ఒడిగడుతున్న వారినేమి అనాలో అర్థం కాదు. కనీసం మానవత్వం అన్నది కూడా ఏ కోశానా లేకుండా, ఆ నిరుపేద బాలలకి పిడికెడన్నం కూడా సక్రమంగా వండి పెట్టలేని దౌర్భాగ్యస్థితి. నాణ్యమైన మంచి భోజనం పెట్టాల్సిన బడులు, హాస్టళ్లలో ఇలాంటి అధ్వాన్నపు భోజనాలు పెడుతున్నా ప్రభుత్వం కానీ, సంబంధిత ఉన్నతాధికారులు కానీ నిమ్మకు నీరెత్తినట్లే ఉంటుండడం దారుణం. మొన్నటికి మొన్న కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో గురుకుల హాస్టల్‌లో కలుషిత ఆహారం తిని 70మందికి పైగానే పిల్లలు ఆసుపత్రుల పాలయ్యారు. తాజాగా గత వారం అల్లూరిజిల్లా జామిగుడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో సుమారు వందమందికి పైగా విద్యార్థులు కలుషిత ఆహారంతో అనారోగ్యానికి గురయ్యారు. వారిలో కొంతమంది ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. కోడిగుడ్డు, రసం అన్నం తిన్న విద్యార్థినులు ఒక్కసారిగా వాంతులు చేసుకున్నారంటే, ఆ భోజనం ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి ఘటనలు నిత్యం బోలెడన్ని. నిరుపేద దళితులు, గిరిజనులు, బడుగు బలహీనవర్గాలకు చెందిన బాలలు, వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి బాగా లేక, చదువుకోవడానికి తగ్గ స్తోమతు లేక ప్రభుత్వ బడులు, హాస్టళ్లలో చేరితే, వాటి నిర్వాహకులు ఏమాత్రం దయాదాక్షిణ్యం లేకుండా, వారి ఇష్టానుసారం ఏదంటే అది వారికి వండి వడ్డించేస్తున్నారు. విద్యార్థుల నుంచి ప్రభుత్వం ఇచ్చే మెస్ చార్జీలు వసూలు చేసుకుంటూ కూడా ఏదో ముష్టి వేసినట్లు కంచంలో విదిలిస్తున్నారు. ఎవరికైనా ఆ సంగతి చెప్పారంటే, ఆ తర్వాత వారికి ఆ పాసిపోయిన అన్నం కూడా దొరకకుండా కక్ష సాధిస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడి నిర్వాహకులు ఇంత దారుణంగా ఉంటున్నా అడిగే నాధులు లేరు. ప్రాథమిక స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు ఎక్కడ చూసినా ఇదే దురవస్త. తాగేందుకు పరిశుభ్రమైన నీళ్లు కానీ, పడుకునేందుకు తగ్గ స్థలం కానీ, మంచి దుప్పట్లు కానీ ఉండవు. ఇరుకు గదులు, సూదుల్లా పొడిచే దోమలు, చివరికి మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేని గురుకులాలు, వసతి గృహాలను చూస్తే మనిషన్నవాడికెవడికైనా గుండె తరుక్కుపోతుంది. అంతెందుకు, ఇటీవలే సాక్షాత్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 'బడిబాట'లో భాగంగా విశాఖపట్నంలోని చంద్రంపాళెంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి, అక్కడ చదువుకుంటున్న 10వ తరగతి విద్యార్థినులతో మాట్లాడుతున్నప్పుడు, వారు నేరుగా తమ కష్టాలన్నీ ఏకరువు పెట్టారు. మధ్యాహ్నభోజనం సరిగా ఉండడం లేదని, పులిహోరా కూరలు బాగా పులిసిపోవడంతో తినలేకపోతున్నామని దీనంగా చెప్పారు. సౌకర్యాల విషయానికి వస్తే..చివరికి మరుగుదొడ్లకు తలుపులు కూడా సక్రమంగా లేవని విద్యార్థినులు వాపోయారంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో తేటతెల్లమవుతుంది. ఒక్క విశాఖలోనే కాదు, రాష్ట్రంలో ఎక్కడ ఏ బడి చూసినా, ఏ హాస్టల్‌ను చూసినా ఇదే దుస్థితి. ఎంతకాలమిలా?.. ఇకనైనా మేలుకోవాలి. కూటమి ప్రభుత్వం ఈ దురవస్తలను సమూలంగా రూపుమాపేందుకు నడుం బిగించాలి. నిరుపేద బిడ్డలకు మానవతా హృదయంతో మంచి అన్నం పెట్టేలా, వారు బాగా చదవుకుని వృద్ధిలోకి వచ్చేలా దృష్టి సారించాలి. ప్రతిచోటా విద్యాలయాలు, వసతి గృహాలకు సంబంధించి తల్లితండ్రులు, సమాజసేవకులు, పార్టీలకతీతంగా స్థానిక నాయకులు, అధికారులతో కూడిన పర్యవేక్షక కమిటీలను నియమించి, విద్యార్థులకు పౌష్టికాహారం లభించేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. మెనూ చార్జీలను కూడా చాలినంతగా పెంచాలి. కలుషిత ఆహారంతో విద్యార్థులు నరకయాతన పడకుండా, ఆకలితో వారు అనునిత్యం అలమటించకుండా మంచి ఆహారం అందించడం ఒక మానవీయమైన కర్తవ్యంగా భావించాలి. సత్వరం వారి సమస్యలను తీర్చేందుకు సమాయత్తం కావాలి. నేటి బాలలే రేపటి పౌరులుగా, నేటి విద్యార్థులే రేపటి భావిభారత నిర్ణేతలుగా వారిని మనమే గొప్పగా తీర్చిదిద్దుకోవాలి. ఇది తక్షణావసరం కూడా!...

# నాయకుడనిపించుకున్న నాయుడు!

పద్నాలుగున్నర సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు మళ్ళీ నాలుగవసారి అధికార బాధ్యతలు చేపట్టిన సంగతి మనకి తెలిసిందే. ఇటీవల విజయవాడలో వరదలు విలయతాండవం చేసిన సమయంలో ఆయన స్పందించిన తీరు అభినందనీయం. రాజకీయాలు పక్కనపెడితే, ముఖ్యమంత్రి స్థానంలో వున్న 75 సంవత్సరాల వయసుగల వ్యక్తి, గాలి పడవలలో, జేసీబీలలో వెళ్లి బాధితులను పరామర్శించడం అనితరసాధ్యం. ప్రజల కష్టాలని స్వయంగాచూసి, వారి కన్నీళ్ళని తుడిచి వారికి భరోసా కల్పించగలిగిన వాడే నిజమైన నాయకుడు. తెల్లవారుఝాము 4గంటల వరకూ విజయవాడ కలెక్టర్ కార్యాలయంలోనే ఉండి కేవలం రెండు గంటలు అక్కడే వున్న బస్సులో బస చేసి, మళ్ళీ ఉదయం 7 గంటలకంతా అధికారుల ముందు ప్రత్యక్షమైన ఆయన కార్యదక్షతని చూస్తే ఆశ్చర్యమనిపిస్తుంది. తన ఆరోగ్యాన్ని సైతం పణంగాపెట్టి మోకాలులోతు నీళ్ళల్లో సైతం నడిచివెళ్లిన ఆయన చిత్తశుద్ధిని కూడా రాజకీయ కోణంలో చూస్తున్న కుంచిత మనస్తత్వం చూస్తుంటే రాజకీయాలంటేనే అసహ్యం కలుగుతోంది.

– డి.హరిత, గూడూరు.

# నేతలూ, అధికారులూ మేల్కోండి!

గత డిసెంబర్‌లో నెల్లూరు నగరంలో భారీ వర్షాలు సృష్టించిన భీభత్సం నగరవాసులు ఇంకా మర్చిపోలేదు. మళ్ళీ వర్షాకాలం వచ్చేసింది. గత ఏడాది నగరంలోని పరిస్థితులు గమనించిన అధికారులు ఇప్పుడు లేరు. చాలామంది బదిలీపై వెళ్లిపోయారు. జరిగిన ఘోరాన్ని కళ్లారా చూసిన రాజకీయ నేతలు ఉన్నారు. ఈసారైనా ముందుగా మేల్కొని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. దురాక్రమణలకి గురైన కాలువలని అక్రమణదారుల చెర నుండి విడిపించాలి. వ్యర్థాలతో పూడిపోయిన వాటిలో పూడికలు తీయించాలి. వర్షపు నీరు సజావుగా వెళ్లిపోయేలా తూములను ఏర్పాటు చేయాలి. చిన్నపాటి వర్షాలకే నెల్లూరు జలమయం అవుతోంది. ఇక విజయవాడ లాంటి వరదలువస్తే అంతే సంగతులు. నేతలూ, అధికారులూ చేతులు కాలాక ఆకులు పట్టుకోకుండా ముందుగా మేల్కొంటే అందరికీ శ్రేయస్కరం!

– ఆర్.పి.రామయ్య, కొండాయపాలెం.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# కష్టాలలో వున్న తెలుగు రాష్ట్రాలని కేంద్రం ఆదుకోవాలి!

గత వారం రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలు వానలు, వరదలతో అష్టకష్టాలు పడుతున్నాయి. తెలంగాణతోపాటు ఆంధ్ర కూడా వరదల తాకిడికి అల్లాడిపోతోంది. ముఖ్యంగా విజయవాడ విలయవాడగా మారిపోయింది. గతంలో ఎన్నడూ చూడనంత పెద్ద విపత్తుని బెజవాడ ఎదుర్కొంటోంది. ఇప్పటికే చాలామంది మనసున్న దాతలు ఆపన్నహస్తం అందిస్తున్నారు. సినిమావాళ్ళు కూడా మేము సైతం అంటూ తమ దాతృత్వాన్ని చూపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా రాజకీయాలని పక్కనపెట్టి రెండు తెలుగురాష్ట్రాల ప్రజలని ఆదుకోవాలి. ముఖ్యంగా విజయవాడ దుర్ఘటనని జాతీయ విపత్తుగా ప్రకటించాలి.

యం.చంద్రమౌళి, కొత్తఢిల్లీ.

## సత్యపీఠం

నిజాలే మాట్లాడుకుందాం! 54

# వ్యాపారాలుగా మారుతున్న ఆచారాలు

ఆధునిక సమాజం కొత్త పుంతలు తొక్కుతోంది.

పక్కవాడికంటే తాను గొప్ప అనిపించుకోవాలని తపనపడుతున్న మనిషి ప్రవర్తన వెర్రితలలు వేస్తోంది.

సంప్రదాయబద్ధంగా చేసుకునే పండుగలు... వ్యక్తి, వ్యక్తులు, సంస్థల గొప్పదనాన్ని ప్రదర్శించుకునే ప్రహసనాలుగా మారుతున్నాయి.

భక్తిశ్రద్ధలతో చేసుకోవలసిన పండుగలు ఆర్భాటాలకి వేదికలవుతున్నాయి.

సంస్కృతీ, సంప్రదాయాలతో పాటు, అనాదిగా వస్తున్న ఆచారాలు కొత్త రూపం సంతరించుకుని, క్రమేణా వ్యాపారాలుగా అవతరిస్తున్నాయి.

## వినాయక చవితి!

ప్రతి ఏటా వచ్చే వినాయక చవితి ప్రాముఖ్యత, ప్రాధాన్యత ఏ ఏడాది కాఏడాది పెరిగిపోతూవుంది. నగరాలలోని ప్రధాన కూడళ్లలో చవితి సంబరాలు నిర్వహించుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. ఇప్పుడా ఆచారం కూడా వ్యాపారంగా అవతరించింది.

వీధికో వినాయకుడన్నట్లుగా నగరాలలోని ప్రతి అపార్టుమెంటులో ఒక భారీ వినాయకుడిని పెడుతున్నారు. అపార్టుమెంటులోని ప్రతీ ఫ్లాట్‌లో స్వతంత్రంగా ఒక బుల్లి వినాయకుడిని పెట్టుకున్నా మళ్ళీ అదే ప్రాంగణంలో మరో పెద్ద వినాయకుడిని పెట్టుకుని సంబరాలు చేసుకోవడానికి జనం ఆసక్తి చూపిస్తున్నారు. పక్క అపార్టుమెంటుకన్నా మన వినాయకుడి సైజు పెద్దదిగా వుండాలన్నట్లుగా పోటీపడుతున్నారు.

గ్రామీణ ప్రాంతాలలో సైతం ఇదే సంప్రదాయాన్ని పల్లె జనం పాటిస్తున్నారు. ఆనవాయితీని ఆసరాగా చేసుకుని, ఆచారాలని పక్కనపెట్టి హంగూ, హంగామాలకి ప్రాధాన్యత ఇస్తున్నారు.

ఒకదానిని మించి ఒకటి భారీగా ఉండాలన్న పోటీతో విగ్రహాల సైజుని పెంచేస్తున్నారు. రాజకీయ నాయకులూ, క్రీడాకారులు, సినీ హీరోలు, ప్రఖ్యాత శాస్త్రవేత్తల రూపాలతో పాటు వివిధ అంశాలని ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఆయా వ్యక్తులు లేదా రంగాల ప్రతిబింబం లేదా ఉనికి ప్రతిబింబించేలా విగ్రహాలని తయారు చేయిస్తున్నారు.

మూడు నుండి ఏడు లేదా తొమ్మిది రోజులపాటు నిర్వహింపబడే ఉత్సవాలకు పేరుమోసిన కళాకారులను రప్పిస్తున్నారు. భారీ వేదికలని ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహిస్తున్నారు.

## పర్యావరణ పరిరక్షణకే ప్రమాదం!

యువతరాన్ని భక్తిభావం వైపు నడిపించడానికి మన పెద్దలు ప్రారంభించిన సంప్రదాయం వినాయక చవితి ఉత్సవం. వినాయక చతుర్థి నాడు పాఠ్య పుస్తకాలు స్వామివారి ముందుంచి, "ఓ బొజ్జగణపయ్యా.. నీ బంటు నేనయ్యా.. ఉండ్రాళ్ల మీదికీ దండు పంపు" అంటూ పూజానంతరం గుంజిళ్ళు తీసి తమ భవిష్యత్తు బాగుండేలా ఆశీర్వదించమని బాల బాలికలు, యువతీ యువకులు స్వామివారిని వేడుకుంటారు.

బంకమట్టితో చేసిన అరచేయంత గణపయ్యని ఇంటికి తెచ్చుకుని, మూడు రోజులు పూజగదిలో ఉంచుకుని, పూజ, పునస్కారం, పురస్కారాలతో పాటు ఆయనకి సకల నైవేద్యాలూ సమర్పించుకుని, మూడు లేదా అయిదవ రోజు నదిలోనో చెరువులోనో నిమజ్జనం చేయడం తరతరాలుగా వస్తున్న ఆచారం.

ఆ ఆచారం క్రమేణా ఆర్భాటంగా మారింది. మట్టి విగ్రహాలు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలుగా రూపాంతరం చెందాయి. అరచేయంత ప్రతిమలు వందల అడుగుల సైజుకి మారిపోయాయి. చలువ పందిళ్లు భారీ సెట్టింగులుగా అవతరించాయి. కళ్ళు జిగేల్మనిపించే విద్యుత్‌దీప కాంతులు, చెవులు దద్దరిల్లే సంగీత, వాయిద్య మోతలు లాంటి హంగామాల పరంపర పెరిగిపోయింది.

భారీ విగ్రహాల తయారీ కోసం వాడుతున్న వస్తువులు, రంగులు, రసాయనాలతో చెరువులు, దొరువులు, నదులు, సముద్రాలు కలుషితమవుతున్నాయి.

శబ్ద కాలుష్యంతో జనాల చెవులకి తూట్లు పడుతున్నాయి. కొన్ని లక్షల వాట్ల అనధికార విద్యుత్ ఈ ఉత్సవాలకు ఉపయోగించబడుతోంది.

ఒకప్పుడు ఉత్సవాలంటే ఆయా దేవుళ్ళ మందిరాలవరకే పరిమితమై ఉండేవి. ఇప్పుడు అవి వాడవాడలకి వ్యాపించిపోయాయి.

## పండుగలలో కూడా రాజకీయాలే..!

ఆధ్యాత్మికతత్వరత ఉన్నవాళ్లు, భగవంతుడిపై భక్తి భావాలు కలిగిన వ్యక్తులు, హిందుత్వంపై అభిమానం కలిగిన కుటుంబాలు ఇలాంటి సంబరాల సమయంలో స్వచ్ఛందంగా ఆర్థిక సహాయాన్ని అందచేస్తారు.

తమ ప్రాంతంలో జరిగే వేడుకను తమ ఇంటి సంబరంలా భావిస్తారు. తమ స్థోమతకి తగ్గట్లుగా విరాళాలాలని అందిస్తారు. ఉత్సవాల నిర్వహణ ఘనంగా జరిగేలా ప్రోత్సహిస్తారు. తాము కూడా సంబరాలలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గణపతిని పూజిస్తారు. తొలిరోజు నుండి నిమజ్జనం నాటివరకూ అంకితభావంతో వినాయక సేవలో తరిస్తారు.

చాలా ప్రాంతాలలో ఇది అనాదిగా వస్తున్న సంప్రదాయమే. కానీ, ప్రతి చోటా రాజకీయాల ప్రమేయం ఉంటున్న ప్రస్తుత "రాచకీయ" యుగంలో పండుగల నిర్వహణలో కూడా ఇటీవల నాయకుల జోక్యం శృతిమించుతోంది. తమ అనుచరులని, అనుయాయులని సంతృప్తిపరచే క్రమంలో అధికారపార్టీ నేతలు వ్యాపారవేత్తలపై వత్తిడి తెస్తున్నారు. నిర్ధిష్టమైన మొత్తాన్ని నిర్ణయించి తమ శిష్యులు తలపెట్టిన వినాయక చవితి సంబరాలకు ఇవ్వాల్సిందేనని దుకాణదారులకి హుకుం జారీ చేస్తున్నారు. తాము చెప్పినంత ఇవ్వకపోతే తీవ్ర ఇబ్బందులని ఎదుర్కోవలసి వస్తుందని బెదిరిస్తున్నారు.

బలవంతపు భక్తిని తమ నెత్తిన రుద్దడమేమిటని వ్యాపారస్తులు వాపోతున్నారు. అడిగితే తమకి తోచినంత ఇస్తాం... అంతే కానీ, వాళ్ళు చెప్పినంత ఇవ్వాలని శాసించడం సరైన పద్ధతి కాదని అంటున్నారు. స్వప్రయోజనం, స్వలాభం, సొంత ప్రభావం కోసం పవిత్రమైన పండుగలని అడ్డం పెట్టుకోవడం సబబు కాదంటున్నారు. నిజంగా భక్తి భావంతో కాకుండా వ్యక్తిగత స్వార్థంతో ఇలాంటి కార్యక్రమాలకి ఎవరైనా పాల్పడుతుంటే వారిని ఆ మహాగణపతి క్షమించుగాక.

## ఆచారం వ్యాపారం కాకూడదు..!

భక్తి తప్పు అని మా భావన కాదు. అపారమైన భక్తి ఉండాలే కానీ అపరిమితమైన ఆర్భాటాలు అవసరం లేదన్నదే మా ఉద్దేశ్యం!

మన బలహీనతలని, భక్తి తత్వాన్ని కొంతమంది స్వార్థపరులు తమ బలంగా మార్చుకుని, ఆచారాలని వ్యాపారాలుగా మార్చుకుంటున్నారన్నదే మా ఆవేదన. పండుగల పవిత్రతను కాపాడాలన్నదే మా తపన!

"జై బోలో గణేష్ మహారాజ్‌కి"...!

- రాజశ్రీ



# కార్పొరేషన్ దుకాణాల్లో బినామీలా?

## - మండిపడ్డ మంత్రి నారాయణ

నెల్లూరు నగరపాలక సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్సుల్లో ఉన్న పలు దుకాణాలను బినామీలు నిర్వహించడంపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పరిధిలోని ప్రభుత్వ దుకాణాలను వేలంలో ఒకరు పాడుకుని దక్కించుకుంటే, మరొకరు రాజకీయ బలంతోనో లేదా రౌడీయిజంతోనో వారి వద్ద నుంచి బలవంతంగా లాక్కుంటున్నట్లు తెలుస్తోందని, అది మంచిపద్దతి కాదని ఆయన అన్నారు. నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజతో కలిసి ఇటీవల ఆయన ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. నెల్లూరునగరంలో బినామీలున్న దుకాణాలను గుర్తించి సీజ్ చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ, ఆ దుకాణాలపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అసలైన లబ్ధిదారులకు న్యాయం చేస్తామని చెప్పారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో భవనాల నిర్మాణాలు చేపట్టి అద్దెలకు ఇవ్వడం అనేది సాధారణమన్నారు. దానిద్వారా ప్రభుత్వానికి కొంతమేర ఆదాయం చేకూరుతుందని తెలిపారు. నెల్లూరు మున్సిపాలిటీలో 223 షాపులను అద్దెకు ఇచ్చారని, అయితే ఆ షాపులను ఒకరు దక్కించుకుంటే, ఏదో ఒక విధంగా మరొకరు లాక్కోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అధికారులు దాడులు నిర్వహించి 52 షాపులను సీజ్ చేశారని చెప్పారు. సుమారు 20, 30 ఏళ్ల నుంచి ఆ షాపుల్లో ఉంటున్నవారిని వెళ్లిపొమ్మనడం న్యాయం కాదని, దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించామన్నారు. రాష్ట్రంలో ఇదేవిధంగా ఉన్న అన్ని షాపుల్లో ఎన్ని సంవత్సరాల నుంచి ఎవరెవరు ఉంటున్నారనే వివరాలను వచ్చే నెల 15వతేదీ లోపు సమగ్రంగా సేకరించాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ శర్మద, డెప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



# జలకళతో సోమశిల

## --- 38 టీఎంసీలకు పెరిగిన వరదనీటి వెల్లువ ---

అడుగంటిపోతున్న జలాశయానికి ఇప్పట్లో నీరు వస్తుందో రాదో అని రైతులు నిరాశపడుతున్న తరుణంలో.. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు వెల్లువగా వస్తుండడంతో జిల్లాలోని సోమశిల జలాశయం జలకళను సంతరించుకుంది. నీటి ప్రవాహంతో సోమశిల డ్యామ్ ఉరకలేస్తోంది. అటు బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడం, మరోవైపు కృష్ణాజలాల రాకతో నెలరోజుల కిందట ఉన్న 9.893 టీఎంసీల నీటిమట్టం, ఈనెల 2వ తేదీ నాటికి 38.872 టీఎంసీలకు చేరుకోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 22.950 క్యూసెక్కుల వరదనీటి ప్రవాహం జలాశయానికి వస్తుండడంతో, పెన్నార్ డెల్టాకు 700 క్యూసెక్కులు, కావలి కాలువకు 350, ఉత్తర కాలువకు 5వేలు, దక్షిణ కాలువకు 6వేల క్యూసెక్కులు వంతున అధికారులు నీటిని విడుదల చేస్తుండడంతో... సంబంధిత ఆయకట్టు రైతాంగంలో ఆనందం వెల్లువెత్తు తోంది. మరో రెండు మూడు రోజుల్లో కూడా వరదనీటి ప్రవాహం మరింత పెరుగుతుందని కూడా అధికారవర్గాలు భావిస్తున్నాయి.

# పాత పెన్షన్ విధానమే మేలు!


## - ఎస్టీయు నాయకులు

ఉద్యోగులకు, ఉపాధ్యాయుల ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగగా ఉన్న సీపీఎస్, జీపీయస్, యూపీఎస్ వంటి విధానాలను వెంటనే రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానమే ఉండాలని కోరుతూ ఈనెల 1న నెల్లూరులో పలు సంఘాల వారు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం(ఎస్టియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళనలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వై.అశోక్‌బాబు, కార్యదర్శి రాజమనోహర్‌లు మాట్లాడుతూ, 2004 సెప్టెంబరు 1వతేదీకి ముందున్న పాత పెన్షన్ విధానాన్నే ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. అలాకాకుండా, కార్పొరేట్ సంస్థలకు కొమ్మకాసే ఇతరత్రా పెన్షన్ విధానాలు వద్దనే వద్దని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఆందోళనలో నాయకులు కె.నరసింహ, పి.సుమన్, ఎన్. వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

# ఎట్టకేలకు మత్స్యకారుల కలలకు సాకారం

- జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను..వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోడీ
- రూ.288 కోట్ల వ్యయంతో నిర్మించిన ఫిషింగ్ హార్బర్ జాతికి అంకితం

ఎట్టకేలకు జిల్లాలోని మత్స్యకారులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రారంభం కావడం మత్స్యకార గ్రామాల ప్రజల్లో సంతోషం కలిగిస్తోంది. జిల్లాలోని తీరప్రాంత మత్స్యకారుల చిరకాల కోరికను నెరవేరుస్తూ మహారాష్ట్రలోని పాల్ఘర్ నుండి ఆగస్టు 30న ప్రధాని నరేంద్రమోడీ వర్చువల్ విధానం ద్వారా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు ప్రారంభోత్సవం చేయడం శుభ పరిణామం. ఈ హార్బర్ ఏర్పాటు వల్ల జిల్లాలోని సుమారు 25వేల మత్స్యకార కుటుంబాల జీవనోపాధికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని భావిస్తున్నారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కావలి శాసన సభ్యులు డీవీ కృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నెల్లూరుజిల్లాలోని బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో దాదాపు 288.8కోట్ల వ్యయంతో 76.89ఎకరాల్లో నిర్మించిన ఫిషింగ్ హార్బర్‌ను ప్రధాని జాతికి అంకితం చేయడం హర్షదాయకమన్నారు.






అదేవిధంగా, స్థానికంగా ఉన్న మత్స్యకారులు గ్రూప్‌గా ఏర్పడితే, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా 40శాతం సబ్సిడీతో వారికి రుణాలు అందజేసేందుకు కృషి జరుగుతోందని చెప్పారు. తద్వారా మత్స్యకారులు మెకనైజ్డ్ బోట్లు కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సదవకాశాన్ని జిల్లాలోని తీర ప్రాంతంలో ఉన్న 9 మండలాల మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలుత, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని కలెక్టర్, ఎంఎల్ఏ కృష్ణారెడ్డిలు ఆవిష్కరించారు.

## కావలికి ఇదో మణిహారం - ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

ఈ కార్యక్రమంలో పాల్గొన్న కావలి శాసనసభ్యులు డివి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, కావలి నియోజకవర్గానికి మణిహారం లాంటి జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రారంభం కావడం సంతోషదాయకమన్నారు. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతూ, నూతన శకానికి నాంది పలికిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. మత్స్యకారులు వేటకు సుదూర ప్రాంతాలకు పోనవసరం లేకుండా వలసలు నివారిస్తూ, స్థానికంగానే చేపల వేట సాగించేందుకు ఇన్నాళ్లుగా పడుతున్న ఇబ్బందులు నేటితో ముగిశాయన్నారు. ఈ హార్బర్ నిర్మాణం ద్వారా సంవత్సరానికి 40 వేల టన్నుల మత్స్యసంపదను వెలికి తీయవచ్చని, హార్బర్ ఆధారిత పరిశ్రమలు కూడా త్వరలోనే వస్తాయని తెలిపారు.

# గిరిజన యువత చైతన్యవంతులు కావాలి

గిరిజన యువత చైతన్యవంతులు కావాలంటూ సింహపురి వైద్య సేవా సమితి వైస్‌ఛైర్మెన్ బాలు సుబ్బారావు పిలుపునిచ్చారు. నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రి, సింహపురి వైద్య సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 1న గొలగమూడిలోని వెంకయ్యస్వామి ఆశ్రమంలో గిరిజన యువతీ యువకుల చైతన్య సదస్సు జరిగింది. దాదాపు 180 మంది యువత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాలు సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొని, తమ సమితి ద్వారా గిరిజనుల కోసం చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. గిరిజన నాయకుడు పొట్లూరి శ్రీనివాసులు మాట్లాడుతూ గిరిజన కుటుంబాల్లోని పిల్లలు చదువుపట్ల శ్రద్ధ చూపాలని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన గురుకులాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని చెప్పారు. స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సెర్డ్, సోమా వంటి సంస్థల వారు గిరిజనుల జీవనోపాధికి అవసరమైన శిక్షణ ఇస్తున్నారని, టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్, మొబైల్



ఫోన్స్ రిపేర్, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, టూ వీలర్ మెకానిజం మొదలగువాటిలో శిక్షణ అవసరమైన వారు తమను సంప్రదించాలని ఏటీడబ్ల్యూఓ అంకయ్య సూచించారు. ట్రైబల్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి సుబ్బారావు, ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ నవీన్, సర్వశిక్ష అభియాన్ ఏఎంఓ సురేంద్ర, డెప్యూటీ డైరెక్టర్ యాకసిరి వెంకటేశ్వర్లు, జయభారత్ ఆసుపత్రి డెప్యూటి మేనేజర్లు వెంకటేష్, మనోహర్, కృష్ణారెడ్డి, గిరిజన నాయకులు ఈగ రామయ్య, శేఖర్, చెంచయ్య, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, రమేష్ పాల్గొన్నారు.

# 6 నుంచి వైభవంగా.. వేళాంగణిమాత ఉత్సవాలు

- కొత్తకోడూరు చర్చిలో భారీ ఏర్పాట్లు

జిల్లాలోని తోటపల్లిగూడూరు మండలం కొత్తకోడూరు వద్ద సముద్ర తీరంలో వెలసివున్న పరిశుద్ధ వేళాంగణి మాత చర్చిలో సెప్టెంబరు 6 నుంచి 8వ తేదీ వరకు పెద్దఎత్తున జరుగనున్న ఉత్సవాలకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. వేళాంగణిమాత జన్మదిన ఉత్సవాలను పురస్కరించుకుని వైభవోపేతంగా ఈ వేడుకలను నిర్వహిస్తామని రోమన్ కేథలిక్ మిషన్ బిషప్ రెవరెండ్ డా. ఎం.డి ప్రకాశం చెప్పారు. ఆ మేరకు ఈనెల 1న నెల్లూరు సంతపేటలో ఉన్న రోమన్ కేథలిక్ కెథడ్రిల్ చర్చి(ఆర్‌సిఎం చర్చి)లో గురువులతో కలసి ఆయన ఉత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి ఆహ్వానం పలికారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలుంటాయి. 6వ తేదీ రాత్రి రక్షణ సహకారిణి సప్రమహోత్సవం ఉంటుందని, 7వ తేదీ ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆరాధన, స్వస్తత ప్రార్థనలు జరుగుతాయని, ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ప్రత్యేకప్రార్థనలు, రాత్రి 8 గంటలకు తేరు ప్రదక్షిణ ఉంటాయన్నారు. సెప్టెంబరు 8న వేళాంగణిమాత జన్మదిన ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ఏసు ప్రభువును, వేళాంగణి మాతను దర్శించుకుని దైవాశీస్సులు పొందాలని కోరారు.



వేళాంగణిమాత చర్చి ఫాదర్ పినపాటి లూకాస్‌రాజ్, గురువులు వైడీ హృదయ్ రాజ్, రొసారియో, పాపారావు, లూయిస్, అలెక్స్, జొహెన్నెస్ పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## సక్రమంగా లేని...
# స్కూల్‌బస్సులపై కఠినచర్యలు

**ఉప రవాణా కమిషనర్ చందర్**



పాఠశాలల బస్సులు సక్రమంగా లేకుంటే సహించేది లేదని ఉప రవాణా కమిషనర్ చందర్ స్పష్టం చేశారు. విద్యార్థులకు భద్రత లేని బస్సుల విషయంలో కఠినచర్యలు తప్పవని చెప్పారు. ఇటీవల ఆయన తన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాలల సంఘం (అపుస్మా) సభ్యులతో సమావేశం ఏర్పాటుచేసి, స్కూల్‌బస్సుల పరిస్థితులను సమీక్షించారు. పాఠశాలల బస్సులకు సంబంధించిన భద్రతా నియమావళిని ఖచ్చితంగా పాటించాలని వారికి తెలియజేశారు. విద్యార్థులకు సురక్షితమైన ప్రయాణాన్ని కల్పించాలని, బస్సుల భద్రతను పర్యవేక్షించడంలో, వాటి నిర్వహణలో పాఠశాల యాజమాన్యాలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉపరవాణ కమిషనర్ వారికి సూచించారు. ముఖ్యంగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఫిట్‌నెస్ లేకుండా పాఠశాల బస్సులను ఎటువంటి పరిస్థితుల్లో అనుమతించరాదని మోటార్ వాహనాల తనిఖీ అధికారులకు ఈ సందర్భంగా ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో అపుస్మా నెల్లూరు నగర గౌరవాధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వెంకటాద్రి, నెల్లూరు నగరశాఖ అధ్యక్షులు అజంతా వెంకటేశ్వరరెడ్డి, కోశాధికారి అభిషేక్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేణుగోపాలునికి..విశేష అలంకారాలు



నెల్లూరు మూలాపేటలోని రుక్మిణి–సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో వేడుకగా జరుగుతున్న శ్రీకృష్ణావతార మహోత్సవాల్లో భాగంగా, ఇటీవల ఆలయ అర్చకులు స్వామివారికి గోవర్ధనగిరిధారి అలంకారాన్ని శోభాయమానంగా నిర్వహించారు. రంగురంగుల పూలమాలికలతో, స్వర్ణాభరణాలతో వేణుగోపాలుడు, ఉభయదేవేరులు భక్తులకు నయనానందకరంగా దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఇఒ చంద్రశేఖర్‌రావు పర్యవేక్షించారు.

# జిల్లా ప్రత్యేకాధికారిగా..హరికిరణ్

జిల్లా అధికారులతో కలిసి ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలు తీరును పర్యవేక్షించేందుకు, ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్‌గా పనిచేస్తున్న హరికిరణ్‌ను జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# బడిపిల్లలకు పెట్టే అన్నం..బాగుండాలి



## నిర్వాహకులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం

బడిపిల్లలకు పెట్టే భోజనం నాణ్యమైనదిగా, రుచిగా–శుచిగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఇటీవల నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం' కార్యక్రమం అమలుపై మండల విద్యాశాఖాధికారులు, పాఠశాల తల్లుల కమిటీలు, కుకింగ్ ఏజెన్సీలకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని దాదాపు 2,570 పాఠశాలల్లో 1,66,056 మంది విద్యార్థులకు ప్రతిరోజు మధ్యాహ్న భోజనం పెడుతున్నారని తెలిపారు. విద్యార్థులందరికీ పౌష్టికాహారం అందించాలని, వారు కోరిన విధంగా మధ్యాహ్నం బడి భోజనంలోను, ఆహార మెనూలోనూ మార్పులు చేయాలని ఆయన సూచించారు. పాఠశాలలలో విద్యార్థులు ఇష్టంగా తినే ఆహారాన్ని అందించడానికి అధికారులు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కుకింగ్ ఏజెన్సీలవారు పాల్గొన్నారు.

## వేమన పద్యాల పోటీలో..
# డా.కిషోర్స్ రత్నం విద్యార్థిని ప్రతిభ




నెల్లూరులోని డా.జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో ఇటీవల నిర్వహించిన ప్రజాకవి వేమన పద్యాల పోటీల్లో నెల్లూరులోని డా. కిషోర్స్ రత్నం ఐఐటి –మెడికల్ ఒలంపియాడ్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని వై.పల్లవి ప్రతిభతో రాణించి జిల్లాస్థాయిలో తృతీయస్థానం సాధించింది. వేమన పద్యాలను రాగయుక్తంగా, ఉచ్చారణ దోషం లేకుండా ఆలపించి ఆ విద్యార్థిని అందరి ప్రశంసలందుకుంది. ఈ సందర్భంగా ఆ విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్, జనరల్ మేనేజర్ రామమూర్తినాయుడులు పల్లవిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల తదితరులు పాల్గొన్నారు.

# వైద్యకళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా.. డాక్టర్ గోవిందు



నెల్లూరులోని ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరాదేవి ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో ఆ స్థానంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎన్.గోవిందును నియమిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులిచ్చింది. ఈనెల 2న వైద్యకళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ చేసిన వసుంధరాదేవిని పలువురు అధ్యాపకులు, ప్రొఫెసర్లు సన్మానించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ గోవిందుకు డాక్టర్ వసుంధరాదేవి శుభాకాంక్షలు తెలిపారు.



# రిటైర్డ్ పోలీసులకు.. ఎస్పీ సన్మానాలు

పోలీసు శాఖలో ఉద్యోగ విరమణ చేసిన ఏఆర్ ఎస్సై కె.ప్రసాద్, సంతపేట హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులుని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఇటీవల ఘనంగా సన్మానించి, విశ్రాంత జీవితాన్ని వారు హాయిగా గడపాలని ఆకాంక్షించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశమందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, నగర డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి, సంతపేట ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరి దేవాలయంలో..
# సామూహిక కుంకుమార్చన



శ్రావణమాసం ఉత్సవాల్లో భాగంగా ఇటీవల నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో అత్యంత వైభవంగా సామూహిక కుంకుమార్చన పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురాంశర్మ, వేద పారాయణదారు రామకృష్ణశర్మ, అర్చకులు ఈ పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు కుంకుమ, జాకెట్, అమ్మవారి ఫోటో మరియు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జె. వెంకటసుబ్బయ్య పర్యవేక్షించారు.

# ఫోర్జరీ కేసులో..మరొకరు అరెస్ట్

నెల్లూరు నగరపాలక సంస్థలో కమిషనర్ల సంతకాలను ఫోర్జరీ చేసిన కేసులో తాజాగా మరో టౌన్‌ప్లానింగ్ అధికారి (టీపీఓ) బి.ప్రవీణ్‌కుమార్‌ను నగర డిఎస్పీ శ్రీనివాసరెడ్డి అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇద్దరు టీపీఓలు, మేయర్ భర్త జయవర్ధన్, ఆయన వ్యక్తిగత సహాయకుడు, మరో ఇద్దరు సచివాలయ ఉద్యోగులు, ఓ ప్రైవేట్ ఇంజనీర్‌పై పోలీసులు కేసు నమోదు చేయగా, వారిలో శివకృష్ణ, టీపీఓ దేవేంద్రలతో పాటు ప్రవీణ్‌కుమార్‌ను కూడా అరెస్ట్ చేశారు. మిగిలినవారి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

# సాధనతోనే విజయాలు సాధ్యం

**వెటరన్ క్రీడాకారిణి లక్ష్మీసుహాసిని**



నెల్లూరుకు చెందిన వెటరన్ క్రీడాకారిణి లక్ష్మీసుహాసిని విదేశాల్లో జరిగిన క్రీడల్లో హ్యామర్ త్రో విభాగంలో కాంస్య పతకాన్ని సాధించడం జిల్లాకే గర్వకారణమని నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి అన్నారు. ఈనెల 1న నెల్లూరులోని డాక్టర్ ఎస్ఆర్‌కె విశ్వసాయి పాఠశాల ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో పలువురు కవయిత్రులు డాక్టర్ లక్ష్మీసుహాసినిని సన్మానించారు. 72 ఏళ్ల వయస్సులో కూడా ఆమె విదేశీ పర్యటనలు చేసి క్రీడల్లో పాల్గొంటూ బహుమతులు గెలుచుకోవడం ఎంతోమంది క్రీడాకారులకు స్ఫూర్తినిస్తోందని వారు కొనియాడారు. ఈ సందర్భంగా లక్ష్మీసుహాసిని మాట్లాడుతూ, నిరంతర సాధన, పట్టుదల, శ్రమతో ఎలాంటి విజయాలనైనా సాధించవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో కవయిత్రులు సందడి అరుణ, తోట సులోచన, కరుణశ్రీ, నాగేశ్వరమ్మ, కృష్ణవేణి, లలిత సుందరి తదితరులు పాల్గొన్నారు.




# కార్పొరేషన్‌కు..కొత్తప్రణాళికాధికారి

నెల్లూరు నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగం ముఖ్య ప్రణాళికాధికారిగా మంగళగిరిలో ఏపీఐఐసిలో జేడీ టీపీగా పనిచేస్తున్న వి.కృష్ణకిశోర్ నియమితులయ్యారు. ఇక్కడ ఆ స్థానంలో పనిచేస్తున్న దేవీకుమారిని తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ముఖ్య ప్రణాళిక అధికారిణిగా నియమించారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌సింఘాల్ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు.

అదేవిధంగా, నగరపాలక సంస్థ టీపీఓ ఏ.ప్రసాద్‌ను బదిలీచేస్తూ, డెప్యుటేషన్‌పై చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు.

# క్యాన్సర్ భూతాన్ని తరిమేద్దాం..

## అవగాహన సదస్సులో వేమిరెడ్డి దంపతులు





'క్యాన్సర్ అంటువ్యాధి కాదు. క్యాన్సర్ వ్యాధికి చికిత్స వుంది కాబట్టి భయపడాల్సిన అవసరం లేదు. క్యాన్సర్ భూతాన్ని కోవూరు నుంచి తరిమేద్దాం'..అంటూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రజలకు ధైర్యం చెప్పారు. నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్‌లో ఇటీవల వేమిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు అయిదు వందల మందికి పైగా ఆశావర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ వ్యాధి నూటికి నూరు శాతం నయమవుతుందని, క్యాన్సర్ గురించి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలందించే ఆశావర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు చొరవ తీసుకొని గ్రామాల్లోని మహిళలకు ఈ వ్యాధి నివారణ పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విపిఆర్ ఫౌండేషన్ ఇటీవల తిరుపతిలోని స్విమ్స్ హాస్పిటల్‌కు ఇచ్చిన క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ యూనిట్ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, సాధారణంగా ఎక్కువగా మహిళలే క్యాన్సర్ బారిన పడుతుంటారని అన్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా చాలా మంది క్యాన్సర్ బాధిత మహిళల దయనీయ పరిస్థితులను తాను కళ్ళారా చూశానని, వారిని ఆ బాధల నుంచి తప్పించేందుకు కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలకు ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించుకున్నానన్నారు. విపిఆర్ ఫౌండేషన్ ద్వారా స్విమ్స్ హాస్పిటల్‌కు తాము ఇచ్చిన బస్సులో బ్రెస్ట్ క్యాన్సర్, న్యూట్రస్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్‌కు సంబంధించిన ఉచిత పరీక్షలు నిర్వహిస్తారన్నారు. నలభై అయిదు రోజుల పాటు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించే పింక్ బస్సు గ్రామాలలో పర్యటిస్తుందని, ఈ సౌకర్యాన్ని కోవూరు నియోజకవర్గ సోదరీమణులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. తిరుపతి స్విమ్స్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లలిత్, డాక్టర్ చంద్రభాను, డాక్టర్ పద్మావతి, డాక్టర్ హేమలత, డాక్టర్ బ్రిజిత, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం!



## వీ.ఆర్. కళాశాల మధుర జ్ఞాపకాల వేడుకగా...

# సహచర విద్యార్థుల ఉద్యోగ విరమణ వేదిక!

అవును... వాళ్లంతా ఓ చోట కలిశారు. పేరుకి అది తమ సహచర విద్యార్థుల పదవీ విరమణ వేదిక. కానీ నాలుగు దశాబ్దాల క్రితం తామంతా కలసి పంచుకున్న మధుర జ్ఞాపకాల వేడుకగా అది మారింది. చిరస్మరణీయ స్మృతుల వీచికగా అందరినీ అలరించి ఆనందపరచింది.

వీ.ఆర్. కళాశాలలో 1983–1986 సంవత్సరాల మధ్య వారంతా కలసి బి.కాం డిగ్రీ చదువుకున్నారు. కాలేజీ విడిచి పెట్టిన తరువాత తమ జీవన పోరాటంలో తలోదిక్కుకి వెళ్ళి స్థిరపడ్డారు. వారిలో కొందరు నెల్లూరులోనూ, మరికొందరు ఇతర రాష్ట్రాలలో, ఇతర దేశాలలో కూడా స్థిరపడిపోయారు.

ఈ క్రమంలో వారితో కలసి చదువుకున్న ఓ నలుగురు మిత్రుల పదవీవిరమణ సందర్భంగా వారి సహాధ్యాయి, ప్రముఖ న్యాయవాది త్వరకవి వెంకట శ్రీనివాసరావుకి ఓ ఆలోచన వచ్చింది. సహజంగా షష్టిపూర్తి కుటుంబసభ్యులు చేస్తారు, పదవీ విరమణ వారి సహోద్యోగులు చేస్తారు. కానీ, అలాకాకుండా పదవీ విరమణ పొందినవారితో కలసి చదువుకున్న పూర్వ స్నేహితులనందరిని ఓ చోట కలిపి వారి పదవీ విరమణ వేడుక చేయాలన్న సంకల్పం కలిగింది.

అంతే... తనకి ఆ ఆలోచన వచ్చిన వెంటనే నగరంలోని సరస్వతినగర్‌లో వున్న ఐయంఏ హాలుని ఆ వేడుకకి వేదికగా ఎంచుకున్నారు. సెప్టెంబర్ 1న ముహూర్తం పెట్టుకున్నారు. తనతో పాటు చదువుకున్న 128 మందికి సమాచారం అందించి ఆహ్వానించారు. శ్రీహరికోటలో పనిచేసిన వెంకటేశ్వరరావుని, విజయ డెయిరీలో విధులు నిర్వహించిన గోపాలకృష్ణని, ఆర్టీసీలో సేవలందించిన కృష్ణయ్యని, సాంఘిక సంక్షేమ శాఖలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన ఉమామహేశ్వరరావుని ఆనాటి కార్యక్రమానికి హీరోలని చేసి సత్కరించారు. వీరంతా ఆగష్టు 31న పదవీ విరమణ పొందారు.

టీ.వీ.శ్రీనివాసరావు ఆహ్వానించిన 128 మందిలో 34 మంది ఆ ఆత్మీయ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాత జ్ఞాపకాలని గుర్తు చేసుకున్నారు. కాలేజీ ముచ్చట్లని పంచుకున్నారు. చిలిపి పనులని తల్చుకున్నారు. తమ గురువులని జ్ఞాపకం చేసుకున్నారు. ఆనందోత్సాహాల మధ్య పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. అందరూ కలసి ఒక ట్రస్టుని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఆపన్నులకి తమకి చేతనైన సహాయం చేయాలని నిశ్చయించుకున్నారు. తామంతా ఓ చోటకి చేరడానికి స్ఫూర్తి కల్పించిన తమ నేస్తం శీనుని అభినందించారు. మళ్ళీ మళ్ళీ ఇలాగే కలుద్దాం.. అని చేతిలో చెయ్యేసి చెప్పుకున్నారు. మధుర స్మృతులతో గృహోన్ముఖులయ్యారు.

ఈ కార్యక్రమంలో సన్మానగ్రహీతలు మురళీకృష్ణ, వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, కృష్ణయ్యలతో పాటు... సురేష్‌రెడ్డి, నారాయణరెడ్డి, మధు, సురేష్, జి.శ్రీనివాసులు, వెంకట సత్యనారాయణ, రాజేంద్ర, కే.శేఖరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వేణుగోపాల్, మదన్‌మోహన్, ఆనంద్, ఎస్.ఎల్.ఎన్ ప్రసాద్, సంపత్‌కుమార్, శ్రీనివాసులురెడ్డి, నగేష్‌రెడ్డి, రంగనాథం, హనుమయ్య, రాజశేఖర్, టి.వి.శ్రీనివాసరావు, జి.వి.చౌదరి, జి.లక్ష్మీనారాయణ, ఏ.చంద్రశేఖర్, పద్మావతి లక్ష్మీరాజ్యం, హేమ, రాజేశ్వరి, కృష్ణప్రియ, విజయలక్ష్మి, వెంకటసుబ్బారావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సహచర మిత్రుల పదవీ విరమణని అపురూప ఆత్మీయ చిరస్మరణీయ వేడుకగా నిర్వహించి, పాత మిత్రులందరినీ ఒక చోటకు చేర్చి వారిలో సేవాస్ఫూర్తిని రగిలించిన శ్రీనివాసరావు ధన్యుడు!




# నీతి ఆయోగ్ సీఇఓతో..ఎంపీ వేమిరెడ్డి భేటీ

ఢిల్లీలోని నీతి ఆయోగ్ సీఇఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యంను నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల మర్యాదపూర్వకంగా కలుసుకుని, శాలువాతో సన్మానించి తిరుమలేశుని ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం జిల్లా అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను ఆయనతో చర్చించారు.

# వరద బాధితులకు.. నెల్లూరు నేతల చేయూత

## మేమున్నామంటూ సాయం అందిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే కాకర్ల



విజయవాడలో వరద బాధితులకు సాయం అందించే పనుల్లో నెల్లూరుకు చెందిన పలువురు నాయకులు నిమగ్నమై ఉన్నారు. బాధితులను పరామర్శిస్తూ, వారికి కావాల్సిన సాయంచేస్తూ, మీకు అండగా మేమున్నామంటూ బాధితులకు ధైర్యం చెప్తున్నారు. విజయవాడ 7వ డివిజన్‌లో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలసి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తదితరులు బాధితులకు ప్రభుత్వ సహాయక కార్యక్రమాలు అందేలా చూస్తున్నారు. విజయవాడలోని వరద ముంపు బాధితుల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలను సందర్శించి వారికి మెరుగైన వసతులను కల్పించేందుకు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ ఏర్పాట్లు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఉదయగిరి టీడీపీ నాయకులు చైతన్య, మధురెడ్డి తదితరులు వారితో పాటు ఉన్నారు.






# ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు



గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడా పోటీలను ఎంఈవో సనత్‌కుమార్ ఇటీవల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. ఎంఈవో కాంచన పాల్గొన్నారు.

# నిజాయితీ అధికారిపై.. నిందలా?



**● గొలగమూడి ఆలయ ఉభయకర్తలు, భక్తుల ఆవేదన**

అవధూత, భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి ఆశ్రమంలో ఇఓగా ఉంటూ, ఆశ్రమాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అన్నివిధాలుగా అభివృద్ధిచేస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి పి.బాలసుబ్రహ్మణ్యంపై అర్థంపర్థంలేని నిందారోపణలు చేయడం దారుణ మంటూ పలువురు ఆలయ ఉభయకర్తలు, భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

గొలగమూడిలోని స్వామివారి ఆలయం ఎదుట వారు ఈనెల 3న విలేకర్లతో మాట్లాడుతూ, వెంకయ్యస్వామివారికి వారసులమంటూ ఇటీవల ఆరాధనోత్సవాలకి వచ్చిన కొందరు, ఆశ్రమ ఇఓపై లేనిపోని నిందలు వేయడం సరికాదన్నారు. అసలు 'అవధూత'లంటేనే, కుటుంబ బంధాలు.. బంధువులు.. సామాజిక బంధనాలు అన్నిటినీ వదిలి సర్వసంగపరిత్యాగులైన మహాయోగులని, వారికి ఎలాంటి ఆస్తులు కానీ.. వాటికి వారసులు కానీ ఉండరని, వెంకయ్యస్వామివారు చిన్నతనంలోనే అన్నిబంధాలను వీడి, సొంత ఊరిని కూడా వదిలివచ్చి గొలగమూడిని నివాసంగా చేసుకున్నారని, ఆ స్వామి పాదస్పర్శతో గొలగమూడి దివ్యక్షేత్రం అయిందని వారు తెలిపారు. పిలిస్తే పలికే దైవమైన అవధూత భగవాన్ వెంకయ్యస్వామి వంటి యోగయోగీశ్వరునికి తాము వారసులమంటూ, ఇన్నేళ్లుగా..ఎప్పుడూ లేని విధంగా కొందరు ఆశ్రమానికి వచ్చి, తమకు మర్యాదలు చేయడం లేదంటూ ఇఓపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని వారు పేర్కొన్నారు. ఆశ్రమ ఇఓ ఎంతో నిజాయితీ కలిగిన అధికారి అని, ఎలాంటి అన్యాయాన్నీ ఆయన సహించరనే విషయం ఆశ్రమంలో ఉన్నవారందరికీ తెలుసని వారు పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో.. సాక్షాత్తూ కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధిలో జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఆయన ఏళ్ల తరబడి నిబద్ధతతో పనిచేశారని, అక్కడ రిటైరయ్యాక, హైకోర్టు వారి ఆదేశం ప్రకారం ఆయనిక్కడ పనిచేస్తున్నారని, ఒక్కపైసా కూడా జీతం తీసుకోకుండా వెంకయ్యస్వామిపై అపారమైన భక్తితో సేవచేస్తున్న ఆయన పట్ల చులకనగా, దురుసుగా మాట్లాడడం బాధాకరమని అన్నారు. హైకోర్టు వారు ఏళ్ళతరబడిగా ఆయన్ను ఇఓగా కొనసాగిస్తున్నారంటే అది ఆయన సేవాభావానికి, నిజాయితీకి, ఆశ్రమ అభివృద్ధి పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనమని, ఆయన ఇఓగా వచ్చాకే గొలగమూడిలో పేద విద్యార్థులకు విద్య, వైద్యం మరింతగా అందుబాటులోకి వచ్చాయని, గొలగమూడి గ్రామస్తులకు కూడా ఎన్నో సౌకర్యాలు కలిగాయని తెలిపారు. గొలగమూడిని ఎంతో అభివృద్ధి చేస్తూ మంచిపేరు తెచ్చుకున్న 80ఏళ్ళ వయసున్న ఇఓపై కనీస గౌరవం లేకుండా పనిగట్టుకుని దుష్ప్రచారాలు చేస్తుండడం దురదృష్టకరమని వారు విచారం వ్యక్తం చేశారు. ఆశ్రమంలో ఒకప్పుడు భక్తులకు పెద్దగా సదుపాయాలు ఉండేవి కావనీ, ఇప్పుడు ఎన్నో సౌకర్యాలతో అభివృద్ధి చెందుతోందని, నిరంతరం వందలాదిమందికి ఆశ్రమంలో అన్నదానం చేస్తున్నారని, ఒకప్పుడు కేవలం రూ.7కోట్లుగా ఉన్న స్వామివారి ఆస్తి, ఇప్పుడు సుమారు 200కోట్ల రూపాయలకు పైగా పెరిగిందని భక్తులు తెలిపారు. ఆశ్రమం ఇంత గొప్పగా విరాజిల్లుతున్నదంటే దానివెనుక ఎంతో కృషి జరుగుతోందన్నారు. ఇఓతో పాటు.. ఆశ్రమ కమిటీవారు, హైకోర్టు వారి పర్యవేక్షణ, జిల్లా ఉన్నతాధికారుల సూచనలు, ఉభయకర్తలు, వేలాదిమంది భక్తులు, గొలగమూడి గ్రామస్తులు.. ఇలా అందరి సహకారంతో ఏళ్ళ తరబడి నిరంతరం శ్రమపడితేనే ఆశ్రమం ఇంతటి అభివృద్ధి సాధించిందని వారు వివరించారు. ఆశ్రమం పూర్వ చరిత్ర, ఇప్పటి స్థితిగతులు తెలిసినవారికే ఈ విషయాలు అర్థమవుతాయన్నారు. కళ్లముందు ఇంత అభివృద్ధి కనిపిస్తున్నా, ఆశ్రమంలో ఏమీ అభివృద్ధి లేదంటూ అసత్యఆరోపణలు చేయడాన్ని ఆ భగవంతుడైన వెంకయ్యస్వామివారు కూడా క్షమించరని వారన్నారు. ఒక్క ఇఓపైనే కాదు.. ఎవరిపైనైనా సరే, అబద్ధపు ఆరోపణలు చేయడం, అసత్య ప్రచారాలకు పాల్పడడం ఎవరికీ మంచిపద్ధతి కాదని, అందులోనూ నిజాయితీగా పనిచేసేవారిపై నిందలు వేయడం కన్నా ఘోరమైన పాపం మరొకటి లేదన్నారు. ఏనాడూ ఒక్కరూపాయి అవినీతికి కూడా పాల్పడని అధికారిపై ఆరోపణలు చేయడానికి వారికెలా మనసొప్పిందంటూ పలువురు భక్తులు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. మంచి చెడులను అన్నిటినీ ఆ భగవంతుడే చూస్తూ ఉంటాడని, ఇకనైనా నిందాపూరితమైన, నిరాధార ఆరోపణలు చేసేవారు.. తాము చేస్తున్న విమర్శలు సమంజసమైనవేనా అని ఒక్కసారి పునరాలో చించుకోవాలని వారు హితవు పలికారు.

# కోవూరులో పూడికతీత పనులకు శ్రీకారం

- విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రొక్లయిన్ ఏర్పాటు
- రైతన్నల రుణం తీర్చుకుంటానన్న ఎమ్మెల్యే ప్రశాంతమ్మ




కోవూరు నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగు నీరందించి రైతన్నల రుణం తీర్చుకుంటానని, ఎల్లవేళలా రైతులకు అండగా ఉంటానని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. విడవలూరు మండలం వీరారెడ్డిపాళెం గ్రామంలోని కడిదేవి కాలువలో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా చేపట్టిన పూడికతీత పనులను ఆమె ఇటీవల ప్రారంభించారు. ఇప్పటికే 'క్లీన్ కోవూరు' పేరుతో విపిఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో కోవూరు, పడుగుపాడు గ్రామాలలో గత నెల రోజుల నుంచి డ్రైనేజ్ కాలువలలో పూడికతీత పనులు జరుగుతున్నాయి. గతంలో ఏళ్ళ తరబడి సాగునీటి కాలువలలో పూడిక తీయకపోవడంతో ఆయకట్టు చివరి భూములకు నీరందడంలేదని రైతులు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ దృష్టికి తీసుకురావడంతో, ఆమె వెంటనే పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. విపిఆర్ ఫౌండేషన్‌కు చెందిన ప్రొక్లయిన్‌ను కోవూరు మురుగు కాలువలలో పూడిక తీసే పనికి కేటాయించారు. కోవూరులో బాపనకాలువ, బుర్ర గుంటచేను కాలువలతో పాటు చిన్న పడుగుపాడులోని పీటర్ కెనాల్, సవక చేను కాలువలలో సిల్ట్ తొలగించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతుల కోసం ప్రత్యేకంగా, సాగునీటి కాలువలలో పూడిక తీయడానికి రెండో ప్రొక్లయిన్‌ను కూడా ఏర్పాటుచేసినట్లు ఆమె ఈ సందర్భంగా చెప్పారు. వర్షాకాలంలో ఎక్కడైనా కాలువలకు గండ్లుపడితే వెంటనే వాటిని పూడ్చడం కోసం మరో ఎక్సవేటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, కడిదేవి కాలువ సిల్ట్ తీస్తే అలగానిపాడు, వీరారెడ్డి పాళెం, వరిణి గ్రామాలలోని పంట పొలాల నుంచి వచ్చే వృధానీటిని బయటకు పంపవచ్చని ఆమె తెలిపారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

**- ఎమ్మెల్యే సునీల్‌కుమార్**



ప్రతిఒక్కరూ కొంత సమయాన్ని వ్యాయామం కోసం కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఉన్న జిమ్ కేంద్రం శిథిలావస్థకి చేరి, పరికరాలు లేకపోవడంతో తాళ్లూరు ప్రసాద్‌నాయుడు దాతృత్వంతో నూతన జిమ్ పరికరాలు ఇటీవల ఏర్పాటు చేసి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ జిమ్‌ను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ప్రతినిధులు రాజేంద్రప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మరపురాని మహానేత వైయస్సార్

**- ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్**



మరపురాని మహానేత డాక్టర్ వైయస్సార్ అని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పేర్కొన్నారు. వైయస్సార్ వర్ధంతిని పురస్కరించుకొని గూడూరు, శాంతి నగర్ వద్ద ఉన్న వైయస్సార్ విగ్రహానికి ఎమ్మెల్సీ మేరిగ మురళి, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ వైయస్సార్ పేద ప్రజల కోసం ఫీజురీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్ లాంటి పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. జడ్పీటీసీ యామిని, మల్లు విజయకుమార్‌రెడ్డి, బత్తిని విజయకుమార్, బొమ్మిడి శ్రీనివాసులు, మీరారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నెల్‌క్యాస్ట్ ఉచిత వైద్య శిబిరం

పెదపరియలోని నెల్‌క్యాస్ట్ లిమిటెడ్, రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరు, కిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో ఇటీవల నెల్‌క్యాస్ట్ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 350 మంది కార్మికులకు పరీక్షలు చేసి తగిన సూచనలు ఇచ్చారు. డాక్టర్లు రవికిరణ్, హేమంత్, శ్రీనివాసులు



నాయుడు, సత్యశ్రీ, గూడూరు రోటరీ క్లబ్ సీనియర్ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, రోటరీ వెస్ట్‌క్లబ్ అధ్యక్షులు నాశిన నాగులు, కార్యదర్శి గిరి, శ్రీకంటి రామ్మోహన్‌రావు, కిమ్స్ సూపర్ స్పెషాలిటీ పిఆర్‌ఓ నవీన్ జయకుమార్, ధనంజయరెడ్డి, సనత్‌రెడ్డి, తాళ్ళూరు శ్రీనివాసులు, బలరామిరెడ్డి మరియు నెల్‌క్యాస్ట్ లిమిటెడ్ ప్లాంట్ ఇన్‌ఛార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, జీఎం కే.మోగుదేషరన్, సీనియర్ పీఆర్‌ఓ ఆనిమెళ్ళ శివకుమార్, హెచ్‌ఆర్ సిబ్బంది సుసైరాజ్, మల్లిఖార్జునరావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# నవావరణ హోమ పూజలు



గూడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న సిఆర్‌రెడ్డి కళ్యాణ మండపం ఆవరణంలో వెదురుపాక విజయదుర్గ పీఠాధిపతుల దివ్య ఆశీస్సులతో సాయి సత్సంగ నిర్వాహకులు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల నవావరణ హోమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక శాంతి కోసం 700వ నవావరణ హోమం నిర్వహించామన్నారు. 21హోమ గుండాలతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# మానవ తప్పిదంతోనే.. వరద కష్టాలు

**గత కొద్ది రోజులుగా కుండపోత వర్షాలు, ఉధృతమైన వరదలతో రెండు తెలుగు రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయి. ప్రాణ నష్టం, అపార ఆస్తి నష్టం వాటిల్లాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నగరంలో సింగ్‌నగర్ సహా పలు ప్రాంతాలు నాలుగడుగుల నుంచి ఆరడుగుల నీటితో నిండి పోయాయి. విజయవాడ నగరమే కాదు, గుంటూరు, గుడివాడ, మచిలీ పట్నం తదితర దక్షిణ కోస్తా పట్టణాలన్నీ చెరువులను తలపించాయి. ఈ వరదలకి కాదు.. వరద కష్టాలకి కారణం మానవ తప్పిదాలేనని స్పష్టంగా చెప్పవచ్చు.**

వరదల దెబ్బకి విజయవాడలో కొన్ని ప్రాంతాల ప్రజలు తాగునీరు, ఆహారం లేక అల్లాడిపోయారు. ఇంటి పైకప్పులపైకి, పై అంతస్తుల్లోకి చేరుకుని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. చాలా విద్యుత్ ఉప కేంద్రాలు మునిగిపోయి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సరఫరా లేకపోవడం, తాగునీటి పథకాల మోటర్లు నీట మునగడంతో నీటి సరఫరా ఆగిపోయింది. గత ఐదేళ్లుగా అధ్వాన్నంగా తయారైన రహదారులన్నీ తాజా వర్షాలు, వరదలతో మరింత నాశన మయ్యాయి. పంటలన్నీ నీట మునిగాయి. వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. మన్ను-మిన్ను ఏకమయ్యేలా ఏకధాటిగా నాలుగు రోజులపాటు కుంభవృష్టి కురవటం వల్ల జనజీవనం స్తంభించడం సహజమే అయినా, ఈ వర్షాలు- వరదలతో ఎదురైన కష్టనష్టాలు మాత్రం అసాధారణం. ప్రజలకు ఇంత కష్టం రావడం వెనక కేవలం ప్రకృతి ప్రకోపించడమే కారణం అనుకుంటే అంతకంటే అమాయకత్వం మరోటి ఉండదు. మానవ తప్పిదమే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది.

## నిర్లక్ష్యమే ప్రధాన కారణం :

కర్ణుని చావుకి కారణాలు అనేకం అన్నట్లు, ఈ ఉపద్రవం వెనక చాలా విషయాలున్నాయి. ఏళ్ల తరబడి, తరాల తరబడి పాలకులు, ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజలు వరదల్లో చిక్కుకుపోవటానికి ఒక ప్రధాన కారణం. ఆంధ్రప్రదేశ్‌లోని మురుగునీటిపారుదల వ్యవస్థ ఏనాడో బ్రిటీష్ కాలంలో ఏర్పాటు చేసింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా, ఆ వ్యవస్థను నేటికీ మన ప్రభుత్వాలు విస్తరించిందీ, ఆధునీకరించిందీ లేదు. దీంతో వరద ప్రవాహం వెళ్లే దారిలేక, కొద్దిపాటి వర్షానికే వరదలై నీటి ప్రవాహం ఇళ్లను ముంచెత్తుతోంది. చెరువు కట్టలు, ఈ ప్రవాహం వెంబడి ఉండే కరకట్టల వంక చూసే నాధుడే కనిపించడంలేదు. భారీగా వరద వచ్చి చేరినప్పుడు గండ్లు పడి వరదంతా ఊళ్ళమీదకి వస్తోంది. విజయవాడ సమీపంలో బుడమేరు ఊరు మీదకి రావడానికి ప్రధాన కారణం కట్టకు గండి పడటమే. దీని మీద ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి నిర్హేతుకమైన ఆరోపణ చేయటం విడ్డూరం. అర్థంపర్థంలేని విమర్శలు ఆయన స్థాయికి ఏమాత్రం తగనవి కాదు. ప్రజలకు మేలు చేయని ఇలాంటి రాజకీయాలను పక్కన పెడితే, ప్రజల వరద కష్టాల వెనక ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం, నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రంగంలోకి దిగితే గాని, యంత్రాంగంలో సిబ్బందిలో కదలిక లేదు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ నుంచి ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో మదింపు చేసి, నష్ట నివారణ చర్యలు చేపట్టాల్సిన అధికార యంత్రాంగం, సిబ్బంది తమకు ఏమీ పట్టనట్టు వ్యవహరించటమే ఇంతటి ముప్పుకు ప్రధాన కారణం.

గత ప్రభుత్వంతో అంటకాగిన కొంతమంది అధికారులు సహాయక చర్యలపై ఏమాత్రం ఆసక్తి చూపడం లేదని, దీంతో వరద బాధితులు ఇంకా ముప్పులోనే ఉండిపోయారని స్వయంగా క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించిన మంత్రి ఒకరు ముఖ్యమంత్రికి చెప్తూ ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. ఇంతకంటే అమానవీయం మరొకటి ఉండదు. మంత్రి వర్గంలో కొంతమంది మంత్రులు కొత్తవారు కావడం, వ్యవస్థపై ఇంకా వారికి పట్టు రాకపోవడం, అధికార యంత్రాంగం, సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం..ప్రజల వరద కష్టాలకు మరో ప్రధాన కారణం. నీరు పల్లమెరుగుతుంది. పల్లానికి, ప్రవాహానికి అడ్డంగా, చెరువుల ప్రాంతాల్లో అడ్డదిడ్డంగా నివాస సముదా యాలు వెలుస్తున్నాయి. వాటిల్లోకి నీరు చేరటం నీటి తప్పు కాదు. ముందే చెప్పినట్టు నీరు పల్లానికే చేరుతుంది. నిర్మాణాలకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చిన ప్రభుత్వ యంత్రాంగానిదే ముమ్మాటికీ తప్పు. ఇప్పుడని కాదు..దశాబ్దాలుగా ఈ తప్పు జరుగుతూనే ఉంది.



## ముందుజాగ్రత్తలే ముఖ్యం

తెలంగాణలో ఈ తప్పిదానికి కాస్తంతయినా దిద్దుబాటు చర్యలు మొదలయ్యాయి. హైడ్రా ఏర్పాటుతో అక్రమ నిర్మాణాలన్నీ తొలగించడం దీర్ఘకాలికంగా మంచి చర్య. ఖమ్మం పట్టణంలో వరద ముంచెత్తడం వెనక మున్నేరు పొంగిపొర్లటం ఒక కారణమైతే, వరదనీటి సహజ ప్రవాహ మార్గానికి అడ్డంగా నిర్మాణాలు వెలియడం మరో కారణం. అందుకే హైడ్రాను తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలన్న డిమాండ్లు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. హైడ్రా లాంటి వ్యవస్థ ఆంధ్రప్రదేశ్‌లోనూ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రకృతి వనరులను నాశనం చేసే, ప్రకృతికి అడ్డంపడే వారు ఎవరినైనా సరే, ఉపేక్షించకుండా కఠినచర్యలు తీసుకుంటేనే ఇలాంటి కష్టనష్టాలను అధిగమించగలం. ముందు జాగ్రత్తలు తీసుకుని ఉంటే, కుంభవృష్టి కురిసినా, ఎగువ నుంచి వరద ప్రవాహం పోటెత్తినా తక్కువ నష్టంతో బయటపడే అవకాశం ఉంటుంది. కానీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా ఎంతోకాలంగా ప్రజలకు ఈ అవస్థలు తప్పడం లేదు. అలాంటి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందే. ప్రజలు చెల్లిస్తున్న పన్నులతోనే వారికి జీతభత్యాలు అందుతున్న సంగతిని, ప్రజల బాగుకోసమే వారిని ఉద్యోగాల్లో నియమించుకున్న విషయాన్ని వారు మర్చిపోవచ్చేమో గాని ప్రజలు మరిచిపోరు. అయితే, ఉద్యోగులం దరూ ఇలాగే ఉంటారని కాదు..కొంతమంది నిర్లక్ష్యం వహించినా ఉపే క్షించకూడదు. మొత్తానికి కొద్ది రోజులుగా ప్రజాజీవనాన్ని అతలాకుతలం చేస్తున్న ఈ విపత్తు అటు ప్రభుత్వానికి, ఇటు సమాజానికి పెద్ద గుణపాఠం కావాలి. తెలుగురాష్ట్రాలను అల్లకల్లోలం చేస్తున్న ఈ విపత్తును కేంద్ర ప్రభుత్వం వెంటనే జాతీయ విపత్తుగా ప్రక టించి, బాధితులకు సత్వరం తగిన సాయం అందించాలి.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**




**అ**దిగదిగో సీతమ్మ! అబ్బ బంగారుతల్లి! ఎంత చక్కనిది! ఏడు మల్లెలెత్తు! ఎండకన్నెరుగని ఇల్లాలు నేడిలా భర్తతో కలిసి అడుగులో అడుగులు వేస్తూ అడవికి బయలుదేరింది!

రాముడు లేని ఈ అయోధ్య మనకెందుకు! రాముడెక్కడుంటే అదే మన నివాసం. అది కొండయినా! పెనుబండయినా! కడలైనా కారడవైనా!

ఈ కొంపలు పాడుబెట్టేద్దాం! ఎలుకలు పందికొక్కులు తిరుగాడుతూ భూతాలకు నిలయమై పాడుబడ్డ అయోధ్యనే ఏలుకొంటాడు భరతుడు, మనమెందుకుండాలిక్కడ?

అందరి మనసులో ఒకటే నిశ్చయం! రాముడే మనకేడుగడ! రామునితోటే జీవనం! రాముడెక్కడుంటే మనమక్కడే!

మానవీయ జీవనానికి రాముడే మూలం! మనమంతా కొమ్మలం రెమ్మలం!.

**మూలం హ్యేషమనుష్యాణాం ధర్మసారో మహాద్యుతిః**
**పుష్పం ఫలం చ పత్రంచ శాఖాశ్చాస్యేతరే జనాః**

రాముడు ధర్మమే సారంగా గలవాడు! గొప్ప కాంతికలవాడు. ఈయనే మనుష్యులకు "మొదలు". ఇతర జనులందరూ ఈ చెట్టు మొదలుతో సంబంధముగల పుష్పాలు, ఫలాలు, పత్రాలు, శాఖలు.

నడచి నడచి తండ్రి సౌధానికి చేరుకొని ద్వారపాలకుని పిలిచి తమ ఆగమన వార్త రాజుకు తెలుపమన్నాడు రాఘవుడు.

రాముడొచ్చాడని తనకు తెలిపిన సుమంత్రునితో రాణులకు కూడా కబురు చేయించాడు దశరథుడు! దశరథుడి రాణులందరూ కౌసల్యతో కలిసి వచ్చారు.

దశరథుడి భవన ప్రాంగణం మూడువందల యాభై మంది రాణులతో, ఆయన మంత్రులతో కిక్కిరిసి ఉంది. రాణులందరూ వచ్చిన తరువాత రాముని ప్రవేశపెట్టమన్నాడు దశరథుడు.

రాముడు అల్లంతదూరం నుండే తండ్రికి నమస్కారం చేసుకుంటూ వస్తున్నాడు.

కొడుకును చూడగనే ఆపుకుంటున్న దుఃఖం ఒక్కసారిగా కట్టలు తెగింది. ఎదురువెళుతూ వెళుతూ దుఃఖభారంతో కూలబడిపోతున్నాడు, చప్పున వచ్చి ఆయన పడకుండా చెరోవైపు పట్టుకున్నారు రామలక్ష్మణులు.

మూర్ఛపోయిన తండ్రికి పరిచర్యలు చేశారిరువురూ! తేరుకున్నపిదప దశరథుడు, రామా నన్ను చంపివేసి అయినా సరే.. నీ రాజ్యం నీవు దక్కించుకో నాయనా! అంటూ ఏడ్వసాగాడు..

ఏమాత్రము మనోవైక్లబ్యం లేని రాముడు ! తండ్రీ! పదునాలుగేండ్లు ఎంతసేపు! మరల తిరిగివచ్చి నీ పదములపైవ్రాలెనా! నీవు చక్రవర్తివి! ఇలా బేలకావలదు!

లోకం నిన్ను అసత్యవాది అని అనటం నేను భరించలేను తండ్రీ!

నీవిచ్చిన మాటను చెల్లించటం నా కర్తవ్యం కాదా ! అసలు అదే నా కర్తవ్యం! నా ధర్మం!

రాముడి మాటలకు దశరథుడు మారుమాటాడలేక నాయనా పోనీ ఈ ఒక్క రాత్రి ఉండిపోరా! నీకిష్టమయినవన్నీ అనుభవించి వెళ్ళు తండ్రీ అని దీనంగా బ్రతిమిలాడాడు! కైకను దూషించాడు.

లోపల ఇంత విషం దాచుకొన్న ఈ స్త్రీ నేడు దానిని బయల్పరచింది. నివురుగప్పిన నిప్పు అని నా కిన్నినాళ్ళు తెలవలేదురా రామా!

తండ్రీ ఈరోజు నీవిచ్చే ఈ భోగాలనుభవిస్తాను, కానీ రేపటినుండీ ఎవరిస్తారు? కోరికలన్నింటినీ విడిచి ఇప్పుడే అడవికి బయలుదేరతాను, అనుమతించండి అని దోసిలి ఒగ్గి నిలుచున్న కొడుకును గాఢంగా కౌగలించుకొని మరల మూర్ఛితుడయ్యాడు దశరథుడు.

ఈ వ్యథలకు కారణమైన కైకను చూసి పట్టరాని కోపమొచ్చింది సారధి సుమంత్రునకు.

కైకమ్మా! ఏ ఆడుదీ చేయకూడని పనిచేశావు, నీ భర్తను క్షోభపెడుతు న్నావు. అంతటి దశరథ మహారాజుకు ఇంతటి వేదన రగిలించావు! నీవు కులఘ్నివి! రాముడు లేని ఈ రాజ్యంలో మేమెవరమూ నివసింపము, ఆయనతోటే వెళ్లిపోతాము. నీవే ఎవరూలేని మరుభూమిలను తలపించే అయోధ్యను నీ కొడుకుతో కలిసి ఏలుకో!

భూమి ఎందుకు బ్రద్దలుకాలేదో నాకు అర్థం కావడంలేదు! లోక మంతా నిన్ను ఛీత్కరిసుంది!


అయినా, ఆడపిల్లకు తల్లి బుద్ధులు వస్తాయంటారు. ఆ తల్లికడుపున పుట్టిన నీకు ఇంతకన్నా మంచి బుద్ధి ఎలా వస్తుందిలే!..

వేప చెట్టు నుండి మధురమైన తేనె వస్తుందా?

నీ తల్లిగూర్చి చెపుతాను విను అంటూ సుమంత్రుడు పలికాడు.

నా అహంకారం నాదే! కట్టుకున్నవాడు కాటికిపోయినా ఫరవాలేదు. ఇది నీ తల్లి బుద్ధి! నీకూ అదే సంక్రమించింది.

ఒక మహాపురుషుడు నీ తండ్రికి ఒక వరమిచ్చాడు. ఆ వర ప్రభావం వల్ల నీ తండ్రి సకలప్రాణుల సంభాషణ అర్థం చేసుకోగలడు.



వరమిచ్చిన మహానుభావుడే ఇంకొక విషయం కూడా చెప్పాడు. తను విన్న సంభాషణ ఎవరికైనాసరే తెలియచేస్తే తనకు మరణం కలుగుతుంది, సంభాషణ వినటం వరకే అధికారం, కానీ విన్నదానిని బయటపెట్టరాదన్నమాట.

నీ తల్లి తండ్రి ఏకాంతంగా ఉన్న సమయమది. మంచం మీద ప్రాకుతున్న "జృంభ" అనే చీమ మాటలాడింది. దాని అర్థం తెలుసుకొన్న నీ తండ్రికి నవ్వువచ్చి బిగ్గరగా నవ్వాడు.

ఆ నవ్వు తనను గురించే పరిహసిస్తూ నవ్వాడనుకొని నీ తల్లి ఆ పరిహాసాన్ని సహించలేక కారణమడిగింది.

నిన్ను చూసి కాదులే! చీమ భలే తమాషాగా మాట్లాడింది. అందుకు నవ్వు వచ్చింది అని అన్నాడు నీ తండ్రి.

చీమ మాట్లాడిన మాటలు తనకు చెప్పమంది మీ అమ్మ! చెబితే తనకు ప్రాణగండముంది, కావున నీ తండ్రి నిరాకరించాడు!

అప్పుడు నీ తల్లి పట్టినపట్టు వీడక నీవు బ్రతికితే నాకేమిటి చస్తే నాకేమిటి? ఆ సంభాషణ నాకు నీవు చెప్పి తీరవలసిందే అని అహంకార పూరితంగా మాట్లాడింది.

నీ తల్లి మంకుపట్టు మానలేదు. మీ నాన్నకు ఏమిచేయాలో తోచక తనకు వరమిచ్చిన మహానుభావుడి సలహా కోరాడు. ఆయన ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దు, ఏమైనా కానీ... అని మళ్ళీ చెప్పాడు.

స్త్రీకి భర్త క్షేమం కన్న ముఖ్యమైనదేదీ లేదు, భర్తకన్నా తన అహంకా రమే ముఖ్యమనుకొన్న స్త్రీ నీ తల్లి! అట్టి నీ తల్లి మూర్ఖపు ప్రవర్తన వల్ల నీ తండ్రి తిరస్కరించాడు. తిరస్కరించి తను క్షేమంగా ఉన్నాడు.

మరల నీవిపుడు దానిని పునరావృతం గావించుచున్నావు! దశరథ మహారాజు ఏ దోషములూ లేని ఉత్తముడు! ..(సశేషం)

# వరద ముప్పు.. ఎవరిదీ తప్పు?

(మొదటిపేజీ తరువాయి)

రూపాయల ఆస్తినష్టం వాటిల్లుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అలసత్వానికి, ప్రజల పట్ల, ప్రజల సౌకర్యాలపట్ల ఆయా ప్రభుత్వాలు చూపిస్తున్న నిర్లక్ష్యధోరణికి ఇలాంటి సంఘటనలు అద్దం పడుతున్నాయి. ఒక్క ఈ ఏడాదే గత రెండు నెలల కాలంలో ప్రకృతి వైపరీత్యాలు దేశాన్ని అతలాకుతలం చేశాయి. కేరళ తదితర ఈశాన్యరాష్ట్రాలతో పాటు పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, గుజరాత్.. చివరికి దేశరాజధాని ఢిల్లీ నగరంతో సహా అనేక నగరాలు వరదల తాకిడికి విలవిలలాడాయి. తాజాగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు ప్రకృతి ప్రకోపానికి బలయ్యాయి. బెజవాడ గడగడలాడింది. ఖమ్మం ఖంగుతినింది. రెండు తెలుగు రాష్ట్రాలు వరద ముప్పుతో ముప్పతిప్పలు పడ్డాయి. ఇంకా పడుతూనేవున్నాయి.

## ప్రణాళిక లేకుండా విస్తరిస్తున్న నగరాలు!

ప్రపంచంలో మూడొంతులు నీళ్లుంటే ఒక వంతు మాత్రమే భూమి ఉంది. ఇది జగమెరిగిన సత్యం. ఎప్పటికైనా ఈ సృష్టి అంతం కావాలంటే అది ఒక్క నీటితోనే (జలప్రళయం వల్లనే) జరుగుతుందని మన పురాణాలు చెప్తూనే ఉన్నాయి. ఎన్నో చరిత్రాత్మక కట్టడాలు, పురాతన నగరాలు నీటి ప్రవాహాల్లో కొట్టుకుపోయి భూగర్భంలో దాగున్నాయనడానికి ఎన్నో సాక్ష్యాలు మన కళ్ళముందున్నాయి. నగరాలు పెరుగుతున్నాయి, భూమి ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని మనం చంకలు గుద్దుకుంటున్నాం. కానీ, ఆ పెరిగే నగరాలు ప్రణాళికాబద్ధంగా పెరుగుతున్నాయా..? ప్రమాదకరంగా పెరుగుతున్నాయా..?? అని మాత్రం ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. పంట పొలాలు ఇళ్ల స్థలాలుగా మారిపోతున్నాయి. చెరువులు లే-అవుట్లగా అవతరిస్తున్నాయి. పంట కాలువలు పూడిపోతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోతోంది. తాత్కాలిక ప్రయోజనాలని, సౌకర్యాలని గమనిస్తున్న జనం, భవిష్యత్తులో రాబోవు విపత్తులని మాత్రం గుర్తించలేక పోతున్నారు. మన ఇంటి చుట్టూ డ్రైనేజీ వ్యవస్థ ఉందా..? ఎన్ని నీళ్లొచ్చినా అవలీలగా వెళ్లిపోగల్గిన వసతి కల్పించారా?? ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తమ బ్రతుకులకి భద్రత, భరోసా ఉందా..??? అన్న అంశాలని వారు విస్మరిస్తున్నారు.

## ప్రభుత్వాల మొద్దు నిద్ర!

ప్రభుత్వాలు సైతం కేవలం అభివృద్ధిని, దాని ద్వారా పన్నుల రూపంలో తమకొస్తున్న ఆదాయాన్ని లెక్కలేసుకుంటున్నాయి తప్ప, ప్రజల బతుకులను విలయాల వలకి అప్పచెపుతున్నాం అన్న కనీస ఆలోచన కూడా చేయడం లేదు. కొత్తగా ఏర్పడే లే-అవుట్లకి డీటీసీపీ అనుమతులు ఉన్నాయా లేవా అని మాత్రమే గమనిస్తున్నారు. అంతే తప్ప అనుమతులు ఉన్న వాటిలో సైతం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఉందా? వరదల లాంటి విపత్కర పరిస్థితి వస్తే నీళ్లు నిలబడకుండా వెళ్లగలిగే స్థాయిలో కాలువలు ఏర్పాటు చేశారా.. లేదా..? వంటి మౌలికమైన అంశాలని విస్మరిస్తున్నారు.

## హైడ్రాతో హైరానా!

కారణం ఏదైనా, తెలంగాణలో ప్రక్షాళన మొదలయ్యింది. దురాక్రమణల మీద ఇది ఒక రకంగా యుద్ధమే. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రా చట్టాన్ని తెరపైకి తెచ్చి ముందుగా సినీ నటుడు నాగార్జునకి చెందిన ఎన్-కన్వెన్షన్‌ని పూర్తిగా నేల కూల్చారు. చెరువులు, దొరువులు, కాలువలు ఆక్రమించిన వారు ఎవరైనా, ఎంతటివారైనా సరే.. చర్యలు ఇలాగే ఉంటాయన్న సందేశం ఇచ్చింది తెలంగాణ ప్రభుత్వం. ఆ ఒక్క దానితోనే సరిపెట్టకుండా ఆక్రమణల కూల్చివేతల పర్వం కొనసాగుతూనే వుంది. హైడ్రాతో చాలామంది హైరానా పడుతున్నారు. తమ ఇష్టానుసారం చెరువులని ఆక్రమించి ఫార్మ్‌హౌస్‌లు కట్టుకున్న వారు, చెరువులని లే-అవుట్లుగా మార్చి సొమ్ము చేసుకున్నవారు, బఫర్‌జోన్‌లని ఆక్రమించుకున్న వారు కంగారు పడుతున్నారు.

## అన్ని నగరాలలో 'హైడ్రా' తరహా చట్టం రావాలి!

దేశంలో అనేక నగరాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో సైతం నదులు, కాలువలు, చెరువులు, వాగులు వంకల్ని రియల్ వ్యాపారులు కబ్జా చేస్తున్నారు. వారితో పాటు పలుకుబడి వున్న ధనవంతులు, రాజకీయ నాయకులు కూడా ఇదే బాటలో నడిచి యథేచ్ఛగా భూఅక్రమణలకి పాల్పడుతున్నారు. ఈ ఆక్రమణలను నియంత్రించాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ, మునిసిపాలిటీ, పట్టణాభివృద్ధి సంస్థల అధికారులు కాసులకి కక్కుర్తిపడి తమ ఇష్టారాజ్యంగా అనుమతులు మంజూరు చేసి ఫైళ్లపై సంతకాలు చేస్తున్నారు. చెరువులకు, దొరువులకి కూడా దొంగపట్టాలు తయారుచేసి ఇస్తున్నారు. దొంగ సర్వేనంబర్లు వేసి ప్రభుత్వ భూములకు పట్టాలు తయారు చేసి సొమ్ముచేసుకుంటున్నారు. చెరువులు, దొరువులు, నదులు, కాలువలు ఆక్రమణలకు గురికాకుండా ఉండాలంటే చట్టాలని కఠినతరం చేయాలి. తెలంగాణ తరహా చట్టం ఇతర రాష్ట్రాలలో కూడా అమలుచేసి, నీటి పారుదల వ్యవస్థలకు అడ్డంకిగా ఉన్న అక్రమ కట్టడాలు.. అవి ఎంతపెద్దవైనా వాటిని తొలగించాలి. ఎవరైనా ఇలాంటి దురాక్రమణలకి పాల్పడాలంటే వెన్నులో వణుకు పుట్టేలా అక్రమార్కులపై కఠినచర్యలు కూడా ఉండాలి.

## పాలకులు, అధికారులు మేల్కోవాలి!

కాశ్మీరం నుండి కన్యాకుమారి వరకు మన పాలకులు, అధికారులు ఈ విషయంలో ఇకనైనా తమ చిత్తశుద్ధి చూపాలి. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నట్లుగా 'వరదలు, ఉప్పెనలు వచ్చిన తరువాత తలలు పట్టుకోకుండా ముందుగానే మేల్కొని ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారమార్గాన్ని అన్వేషించాలి. అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అపరిమిత సంఖ్యలో కొలువుతీరిన ప్రభుత్వ యంత్రాంగాలతో ఇలాంటి విపత్తులకి అడ్డుకట్ట వేయాలి. పాలకులు, అధికారులు మనసు పెట్టి చేయాలే గానీ, ఇది అసాధ్యమైన పనేమీ కాదు!..



# మహానేత డా.వైఎస్.. సేవలు చిరస్మరణీయం

## • వైకాపా నాయకుల నివాళి



దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన పాలన రాష్ట్రానికి ఒక స్వర్ణయుగమని వైకాపా జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కొనియాడారు. డా.వైఎస్ వర్ధంతి సందర్భంగా ఈనెల 2న నెల్లూరులో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్పొరేటర్లు, అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని వైఎస్‌కు ఘననివాళులర్పించారు. స్థానిక గాంధీబొమ్మ కూడలి వద్ద ఉన్న డా. వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి, ప్రజలకు ఆయన చేసిన సేవలను జ్ఞాపకం చేసుకున్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్, పేదలకు ఆరోగ్యశ్రీ,108,104 సేవలు లాంటి డా. వైఎస్ పథకాలు ప్రజలకెంతో ఉపకరించాయన్నారు. ఆయన పాలనలో రైతులు, మహిళలు యువత, ఉద్యోగులు ప్రతి ఒక్కరూ ఎంతో సంతోషంగా ఉన్నారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా వారి తనయుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వారా ప్రజలకు సంక్షేమ-అభివృద్ధి పాలన అందించారని అన్నారు. మళ్ళీ జగన్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వేలూరు మహేష్, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, గుంజి జయలక్ష్మి, రాఘవరావు, ఓబిలి రవిచంద్ర, కామాక్షి, రామకృష్ణ, మస్తానమ్మ, వైసీపీ నాయకులు ఎంవి సుబ్బారెడ్డి, కొణిదల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలయ్య బహుముఖ సేవలు అభినందనీయం



ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ బహుముఖ సేవలు అభినందనీయమని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ కొనియాడారు. తెలుగు సినీరంగంలో అమోఘమైన పాత్ర పోషిస్తూ నందమూరి బాలకృష్ణ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నెల్లూరు నర్తకీసెంటర్‌లో బాలకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు.. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు భారీ కేక్‌ను కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ, అద్వితీయమైన తన నటనాప్రతిభతో తెలుగు ప్రజల మనస్సుల్లో అభిమాన నటునిగా బాలయ్య శాశ్వతస్థానం సంపాదించుకున్నారని, తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఎన్నో వైవిధ్యభరితమైన పాత్రలు పోషించి ప్రేక్షకులను, అభిమానులను అలరించారని అన్నారు. అటు సినీరంగం, రాజకీయరంగాల్లోనే కాక సామాజిక సేవారంగంలో కూడా బాలకృష్ణ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. బాలకృష్ణ తన తల్లి పేరుమీద క్యాన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చేసి పేదప్రజలకు వైద్యసేవలను అందిస్తుండడాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. బాలకృష్ణ అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# జొన్నవాడ దేవాలయానికి రూ.46.17 లక్షల రాబడి



జొన్నవాడలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కామాక్షితాయి అమ్మవారి దేవాలయానికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.46.17 లక్షలు రాబడి వచ్చిందని ఆలయ ఇఓ ఆర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈనెల 4న ఆలయంలోని హుండీలను లెక్కించారు. గత జూన్15 నుంచి సెప్టెంబరు 4వతేదీ వరకు 82రోజులకు ఆ మేరకు ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ ఛైర్మెన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, దేవాదాయశాఖ అధికారి జె.శ్రీనివాస్‌రావు, పాలకమండలి సభ్యులు తదితరులు హుండీల లెక్కింపులో పాల్గొన్నారని ఆయన తెలిపారు.

## కనువిందుగా..
# శ్రీ లక్ష్మీనృసింహుని కల్యాణం



రాపూరు మండలం పెంచలకోన లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. ఆదిలక్ష్మీ - చెంచులక్ష్మీ సమేత శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామివారి దేవాలయంలో ఇటీవల స్వామి-అమ్మవార్ల కల్యాణోత్సవం కనువిందుగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని, ఉభయదేవేరులను ఆలయ అర్చకులు శోభాయమానంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం, స్వామివారి నిత్యకల్యాణమండపంలో వైభవోపేతంగా కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం, సాయంత్రం తిరుచ్చి ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ డిప్యూటీ కమిషనర్ కె.విజయ సాగర్‌బాబు పర్యవేక్షణలో, ఆలయ ప్రధాన అర్చకులు రామయ్య స్వామి, పెంచలయ్యస్వామి తదితరులు ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు.

# మాతృభాష గొప్పతనం మరువలేనిది

**మాడభూషి సంపత్‌కుమార్**



ఎన్ని శాస్త్రాలు, గ్రంథాలు చదివి ఎంత ఉన్నతస్థానాల్లో ఉన్నా మాతృభాష గొప్పతనం మాత్రం ఏనాటికీ మరువలేనిదని వెంకటాచలంలోని తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ చెప్పారు. గిడుగు రామమూర్తి జయంతి, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఇటీవల ఆ కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజెప్పారు తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పేందుకు ప్రతిఒక్కరు కృషిచేయాలన్నారు. భాషే మనుగడకు ప్రాణమని, భాషే లేకుంటే సంస్కృతి సంప్రదాయాలు లేవన్నారు. తెలుగుభాష పరిరక్షణకు ఏర్పాటైన తెలుగు ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం తెలుగువారికి సంబంధించిన అనేక విషయాలను, వాటి విశిష్టతను తెలియజేస్తూ, భావితరాలకు అందించేందుకు నిరంతరం కృషిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రి చంద్రలత, యోగి వేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎన్. ఈశ్వర్‌రెడ్డి, పద్య కళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, ప్రముఖ కవులు చిన్ని నారాయణ రావు, పవన్‌కుమార్, డీకేడబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ డా.గిరి, డా.కరుణశ్రీ, డా.వై దివ్య, డా. రఘురామయ్య తదితరులు పాల్గొని తెలుగుభాష ప్రాముఖ్యతను వివరించారు.

# జొన్నవాడ ఆలయానికి విరాళం

## నిత్యాన్నదానానికి రూ. 50,116 వితరణ



జొన్నవాడలోని శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో నిత్యాన్నదానానికి నెల్లూరుకు చెందిన భక్తులు కొంజేటి వెంకటసత్యనారాయణ-లక్ష్మీకుమారి దంపతులు ఇటీవల 50,116 రూపాయలు విరాళంగా అందజేశారు. ఆ మేరకు విరాళం రసీదును ఆలయ ఇఒ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి దాతలకు అందజేసి అభినందించారు.

# జిల్లాలో 6.. కొత్త 'నగర వనాలు'



పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా త్వరలోనే జిల్లాలో 6 కొత్త 'నగర వనాలు' ఏర్పాటు కానున్నాయని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా.పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని కొత్తూరు నగరవనంలో నిర్వహించిన వనమహోత్సవంలో ఆయన పలువురు ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, మనిషి బతకాలంటే నీరు, చెట్లు ఎంతో అవసరమని, పర్యావరణ పరిరక్షణకు చెట్లే కీలకమన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి ఒక్కరు కనీసం మూడు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, సర్వేపల్లి నియోజకవర్గంలోని కాకుటూరులో జాతీయ రహదారి పక్కనే సుమారు వంద ఎకరాల్లో అద్భుతమైన నగరవనం ఏర్పాటు కాబోతుండడం సంతోషకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో వనమహోత్సవం అట్టహాసంగా నిర్వహించడం జరిగిందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గత టిడిపి ప్రభుత్వంలోనే మంత్రి నారాయణ ఆదేశాలతో 330 ఎకరాల్లో నగర వనం ఏర్పాటు చేశామని, అయితే ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం నగరవనాన్ని అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రిగా, నారాయణ మంత్రిగా రావడంతో వంద శాతం పనులు పూర్తయి నగరవనం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. మరో వారంరోజుల్లో మంత్రి నారాయణ చేతులమీదుగా నగరవనం ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోందన్నారు. జడ్పీ వైస్‌చైర్మన్ ఆనం అరుణమ్మ, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, డిఎఫ్ఓ చంద్రశేఖర్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొని ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. అనంతరం, ఓపెన్ జిమ్‌లో చిన్నారులతో కలిసి అందరూ కాసేపు సరదాగా గడిపారు.

# ఘనంగా పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు

## జనసేన ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు



జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు ఆగస్టు 30న ఘనంగా జరిగాయి. జనసేన పార్టీ నాయకులు వేములపాటి అజయ్‌కుమార్ సూచనల మేరకు నెల్లూరులో నాలుగురోజులు పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో పవన్ కల్యాణ్ కోసం ప్రత్యేక పూజలు నిర్వహించి, నూటొక్క టెంకాయలను కొట్టి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో పర్యావరణ సంరక్షణ కోసం స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో మొక్కలు పంపిణీ చేశారు. నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. సత్యనారాయణపురం ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు భోజనం పంపిణీ నిర్వహించారు. స్థానిక గోమతినగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద మెగా రక్తదాన శిబిరం, అవయవ దానం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్‌ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్, వేములపాటి అజయ్ కుమార్‌రెడ్డి, జనసేన సీనియర్ నాయకులు నూనె మల్లికార్జునయాదవ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా, నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద రోడ్డు మార్జిన్ వ్యాపారస్తులకు గొడుగులు పంపిణీ చేశారు. నెల్లూరులోని అన్న క్యాంటీన్‌లన్నింటిలో అన్నదానం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూనె మల్లికార్జునయాదవ్, వేములపాటి అజయ్‌కుమార్‌రెడ్డిలు చెరో లక్ష రూపాయల విరాళం అందించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు గునుకుల కిషోర్, న్యాయవాది శ్రీరామ్, సుజయ్‌బాబు, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జమీర్, రిషికేష్ యాదవ్, వీర మహిళలు ఆలియా,నందిని, రేణుక, ప్రసన్న, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### కొండాపురంలో విజృంభిస్తున్న డెంగ్యూజ్వరాలు

గత కొద్దిరోజులుగా కొండాపురం మండలంలో డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇటీవలే ఒక బాలుడు ఆ వ్యాధి సోకి మరణించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే ఈ మండలంలో డెంగ్యూ వ్యాధి నివారణకు, అవసరమైన చోట్ల ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి బాధితులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

### కావలిలో విద్యార్థులకు దంత వైద్యపరీక్షలు

కావలిలోని ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు మునిసిపల్ మాజీ ఛైర్మన్..పిఎస్ఆర్ ట్రస్ట్ వైద్య నిపుణులు డాక్టర్ ఎన్ ప్రభాకర్‌నాయుడు సూచనలతో ఇటీవల డాక్టర్ వినయ్‌వినోద్‌బాబు విద్యార్థులకు దంత పరీక్షలు చేసి దంతసంరక్షణ పట్ల అవగాహన కలిగించారు. ప్రిన్సిపాల్ శ్యామ్‌సుధాకర్, షేక్ ఖాదర్‌బాషా పర్యవేక్షించారు.

### కోటపాడులో భక్తులకు అన్నదానం

ఆత్మకూరు మండలం మహిమలూరు పంచాయతీ పరిధిలోని కోటపాడు గ్రామంలో ఇటీవల శ్రీ అభయాంజనేయస్వామి - శ్రీ కోదండరామస్వామి దేవాలయాల నిర్మాణాలు పూర్తయిన సందర్భంగా, ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు అన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో రెండురోజుల పాటు అన్నప్రసాద వితరణ గావించారు.

### ఉలవపాడులో.. 'అమ్మ పేరుతో ఓ మొక్క'

మండలకేంద్రమైన ఉలవపాడులో ఇటీవల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 'అమ్మ పేరుతో ఓ మొక్క' కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. సిడీపీఓ టి.అరుణ మాట్లాడుతూ, ప్రతిగ్రామంలో అందరూ 'అమ్మ పేరుతో ఓ మొక్క'ను నాటి పచ్చదనం-పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, పలువురు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

### రేబాలలో పాఠశాలల తనిఖీ

బుచ్చిరెడ్డిపాళెం మండలం, రేబాలలోని ప్రభుత్వ పాఠశాలలను తహశీల్దారు అంబటి వెంకటేశ్వర్లు ఇటీవల తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. అనంతరం తూర్పు దళితవాడలో ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ భర్త మస్తానయ్య పాల్గొన్నారు.

### కోవూరు కోదండరామునికి.. పల్లకిసేవ

కోవూరులోని గాంధీపార్కు కూడలిలో ఉన్న శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో, శ్రావణమాసం ఆఖరి శనివారం సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో, స్వామివారికి విశేష అలంకరణలు చేసి విశిష్టపూజలు నిర్వహించారు. అనంతరం వైభవంగా నిర్వహించిన పల్లకిసేవలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

### కొడవలూరులో పంట నమోదుపై సమావేశం

కొడవలూరులో పంటల వివరాల నమోదు (ఇ-క్రాప్ నమోదు)పై ఇటీవల వ్యవసాయ అధికారిణి సిహెచ్‌విఎస్ లక్ష్మి ఆధ్వర్యంలో సచివాలయాల వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. రైతులతో కలసి పంటపొలాల్లోకి వెళ్లి పంట నమోదు కార్యక్రమాన్ని ఇచ్చిన గడువుకంటే ముందుగానే పూర్తిచేయాలని ఆమె వారికి సూచించారు.

### నెల్లూరులో పేకాటరాయుళ్ళ అరెస్ట్

నెల్లూరులోని మద్రాసుబస్టాండ్ సమీపంలో ఉన్న ఓ లాడ్జిలో ఈనెల1న పేకాట ఆడుతున్న 14 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నబజారు పోలీస్ ఇన్స్‌పెక్టర్ సిహెచ్ కోటేశ్వర రావుకు వారి సమాచారం అందడంతో, వెంటనే పోలీసు సిబ్బందితో వెళ్ళి పేకాటరాయుళ్ళను పట్టుకుని, వారి వద్ద నుంచి 38,650 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు.

### రాపూరులో సామూహిక వరలక్ష్మీవ్రతం

రాపూరులోని మద్దెలమడుగు కూడలిలో ఉన్న శ్రీ మహా విష్ణు, శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో ఇటీవల సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం, నిర్వాహకులు భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు.

# నెల్లూరుకు మంచిరోజులొస్తున్నాయి!

## • భూగర్భ డ్రైనేజీ పనులు పునఃప్రారంభం



*ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భూగర్భడ్రైనేజీ పనులు తిరిగి చేపట్టనుండడంతో, ఇక త్వరలోనే నెల్లూరుకు మంచిరోజులు వస్తాయని అందరూ భావిస్తున్నారు. ఇటీవల నెల్లూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ పునఃప్రారంభించడంతో నగరవాసుల ఆశలు చిగురించాయి.*

ఎట్టకేలకు నెల్లూరులో గత కొద్ది కాలంగా వైకాపా ప్రభుత్వహయాంలో ఆగిపోయిన భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం కావడం పట్ల సర్వత్రా సంతోషం వ్యక్తమవుతోంది. గతంలో, టీడీపీ హయాంలో రూ.580 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి శ్రీకారం చుట్టి, 82 శాతం పనులు పూర్తిచేయడం తెలిసిందే. ఆ తర్వాత ఆ పనులు ఆగిపోవడంతో నెల్లూరు పరిస్థితి మరింత దయనీయంగా మారింది. చిన్న వానొచ్చినా మురుగునీరు పారుదల వసతుల్లేక, రోడ్లన్నీ దుర్గంధభూయిష్టమవుతున్న నేపథ్యంలో, అప్పటి పనులకు కొనసాగింపుగా మంత్రి నారాయణ ఇటీవల నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వరపురం ఇస్లాంపేటలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పునఃప్రారంభ పనులను ప్రారంభించడం హర్షదాయకం. 15 కోట్ల రూపాయల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టడమే కాక, మరో 3 కోట్ల రూపాయలను తాగునీటి పథకాల కోసం నిధులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ విలేకర్లతో మాట్లాడుతూ, ప్రజలకు ఉపయోగకరమైన ఈ పనులన్నిటినీ ఎల్ అండ్ టీ కంపెనీ వారితో చేయిస్తున్నామన్నారు. ఎన్నికలకు ముందు తాము ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేరుస్తామన్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, 54వ డివిజన్ ఇన్‌చార్జ్ జహీర్, రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, కమిషనర్ సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.


# వరద బాధితులకు అండగా వెంకయ్య కుటుంబం



## రెండు రాష్ట్రాలకి రూ.20 లక్షల సాయం

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరదలకు ప్రజలు కష్టాలు పడుతుండడం, భారీ నష్టాలకు గురవుతుండడం పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును ఆవేదనకు గురిచేసింది. కష్టనష్టాల్లో ఉన్న ప్రజలకు తనవంతు సాయం అందించాలని నిర్ణయించుకుని ఆమేరకు ఆయన తనతో పాటు, తమ కుమారుడు-కుమార్తెల నుంచి కూడా బాధితులకు చేయూతనందించారు. వరదలకు అతలాకుతలమవుతున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సాయంగా తన వ్యక్తిగత పెన్షన్ నుంచి రెండు రాష్ట్రాలకు చెరొక రూ.5లక్షల వంతున వెంకయ్య సాయం అందిస్తూ తెలంగాణ సీఎం సహాయనిధికి, ఆంధ్రా సీఎం సహాయనిధికి ఆ మొత్తాలను పంపుతున్నట్లు ఈనెల 2న తెలిపారు. దాంతోపాటు, తన కుమారుడు హర్షవర్ధన్ నిర్వహిస్తున్న 'ముప్పవరపు ఫౌండేషన్' నుంచి ఒక్కో రాష్ట్రానికి రూ.2.5 లక్షల వంతున, తన కుమార్తె దీపా వెంకట్ ఆధ్వర్యంలోని 'స్వర్ణభారత్ ట్రస్ట్' తరఫున రెండు రాష్ట్రాలకు రూ.2.5లక్షల వంతున మొత్తం 10 లక్షల రూపాయలు తమవంతు సాయంగా అందజేస్తున్నట్లు కూడా ఆయన ప్రకటించారు. వరదల వల్ల కలుగుతున్న నష్టాలను ప్రధాని నరేంద్రమోదీకి ఫోన్ ద్వారా వివరించి, వెంటనే ప్రజలను ఆదుకోవాలని కోరానని, రెండు రాష్ట్రాలకు తగినంత సాయం అందిస్తామని ప్రధాని హామీ ఇచ్చారని ఆయన వివరించారు. ఈ కష్టకాలంలో ఇబ్బందుల్లో ఉన్నవారిని ఆదుకునేందుకు స్వచ్ఛందసంస్థలు ముందుకు రావాలని, యువత సహాయక చర్యల్లో పాల్గొని బాధితులకు సాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# తిరుమలేశుని సేవలో కురుగొండ్ల దంపతులు



**వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ తన సతీమణి సింధుతో కలిసి సెప్టెంబర్ 3వ తేదీ తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వారితో పాటు జిల్లా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కాకర్ల వెంకట్ ఉన్నారు.**

# జనం కష్టాలు పట్టని జగన్

**- ఎమ్మెల్యే సోమిరెడ్డి**



విజయవాడలో వరద కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల మధ్యలో ఉండటాన్ని వైసీపీ జీర్ణించుకోలేకపోతోందని, అందుకే తమ పార్టీ నాయకులపై జగన్ లేనిపోని విమర్శలు చేస్తున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. నెల్లూరులో ఈనెల4న ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, విజయవాడను వరదలు ముంచెత్తాయని, ఎప్పుడూ చూడని ఇలాంటి విపత్తుల నుంచి ప్రజలను కాపాడేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు, అధికారులంతా రాత్రింబవళ్ళు పనిచేస్తుంటే, జగన్ తమ నేతలపై విమర్శలు చేయడం అర్థరహితమన్నారు. బుడమేరు వరదకు చంద్రబాబునాయుడు కారణమని జగన్మోహన్‌రెడ్డి ఆరోపించడం సిగ్గుచేటన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇలాంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఏనాడైనా జనంలోకి వెళ్ళాడా?...వారి బాధలు విన్నాడా?.. అని ఆయన ప్రశ్నించారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగన్ ప్రజల సొత్తును లక్షలకోట్లల్లో దోచేశాడని ఆయన దుయ్యబట్టారు. జనం సొమ్ముతో ఇంత కోటీశ్వరుడైన జగన్మోహన్‌రెడ్డి, ఇప్పుడు ప్రజలు కష్టాల్లో ఉంటే కేవలం కోటిరూపాయల సాయంతో సరిపెట్టుకోవడం దురదృష్టకరమన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని, ఉదారంగా విరాళాలిచ్చి బాధితులకు అండగా నిలవాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# వేడుకగా గురుపూజోత్సవం



గురువును మించిన దైవం లేరని, విద్యార్థుల భవితకు వారే నిర్దేశకులని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఈనెల 5వ తేదీ గురువారం నెల్లూరు కలెక్టరేట్‌లో వేడుకగా జరిగిన గురుపూజోత్సవంలో ఆయన పాల్గొని, ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులనిచ్చి సత్కరించారు. పిల్లల విద్యాభివృద్ధికి, వారి భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ, గురువులే సమాజానికి మార్గదర్శకులన్నారు. కేరళ రాష్ట్రంలో చిన్న గ్రామంలో తాను చదువుకున్నానని, తన తల్లి ఉపాధ్యాయురాలని, ఆమె స్ఫూర్తితోనే తాను ఐఏఎస్ సాధించానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రాథమికంగా 60 జిల్లాలను ఎంపిక చేయడం జరిగిందని, అందులో నెల్లూరు జిల్లా ఉండడం సంతోషదాయకమన్నారు. జిల్లాలో విద్యారంగాన్ని అభివృద్ధి చేసే దిశలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత గురుపూజోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 60 మందిని సన్మానించారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేయర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# 'గ్రీన్ కోవూరు'ను సాధించాలి

## ప్రజలకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా, పచ్చదనాన్ని కాపాడుతూ.. విస్తారంగా చెట్లు నాటడంతో పాటు, వాటి సంరక్షణ బాధ్యత కూడా చూడాలని, తద్వారా 'గ్రీన్ కోవూరు'ను సాధించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నియోజకవర్గ పిలుపునిచ్చారు. ఇటీవల ఆమె కోవూరు మండల కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి వనమహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ప్రశాంతమ్మ మాట్లాడుతూ, రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడేనని, సరిగ్గా 30 ఏళ్ళ క్రితం 1995 సెప్టెంబర్ 1న ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన చంద్రబాబునాయుడు, 'క్లీన్ అండ్ గ్రీన్' పథకం ద్వారా రాష్ట్రంలో పరిశుభ్రత, పచ్చదనంపై ప్రజలకు అవగాహన కల్పించారని ఆమె గుర్తుచేశారు. వనమహోత్సవ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో పచ్చదనం పెంచేందుకు అపారమైన కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను అందరూ మార్గదర్శకంగా తీసుకోవాలన్నారు. కర్నాటక రాష్ట్రంలో చెట్లు పెంచడం ద్వారా హరిత విప్లవానికి నాంది పలికిన పర్యావరణ ఉద్యమకారిణి సాలుమరద తిమ్మక్క స్ఫూర్తితో ఇంటికో చెట్టు పెంచే విధంగా ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. పర్యావరణ లక్ష్య సాధనలో భాగంగా ఇంటికో చెట్టు నాటి 'గ్రీన్ కోవూరు' కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తిచేశారు. అనంతరం, జిల్లా విద్యాశాఖాధికారితో కలిసి కోవూరులోని బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. జిల్లా



అటవీ శాఖాధికారి శివరామకృష్ణ, జడ్పీ సీఈఓ కన్నమనాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి నాగరాజు, ఎంపిడిఓ శ్రీహరి, తహసీల్దారు నిత్యానంద బాబా, జడ్పీటీసీ తుమ్మల పార్వతి, కోవూరు సర్పంచ్ యాకసిరి విజయ తదితరులు పాల్గొన్నారు.

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com